ప్రజాశక్తి
ఆదివారం 18 జూన్ 2023
8 పేజీలు
విశాఖపట్నం అనకాపల్లి





భద్రతపై అలసత్వం

- గడువు ముగిసినా పూర్తికాని బడి బస్సుల ఫిట్‌నెస్ టెస్ట్‌లు
- మొండిగా పాఠశాలల యాజమాన్యాలు
- సామర్థ్య పరీక్షలు నిర్వహించేందుకు వెనుకంజ



ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

జిల్లాలో గడువు ముగిసినా బడి బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తికాలేదు. భద్రతపై పాఠశాలల యాజమాన్యాలు పూర్తి అలసత్వం ప్రదర్శిస్తున్నాయి. వాస్తవానికి పిల్లల భద్రత దృష్ట్యా ఈసారి పాఠశాల బస్సుల సామర్థ్య పరీక్షలు పారదర్శకంగా సాగుతున్నాయి. సామర్థ్య పరీక్షల నిబంధనలను ప్రభుత్వం కఠినతరం చేయడంతో రవాణా శాఖ అధికారులు అన్నింటినీ నిశితంగా పరిశీలిస్తున్నారు. వెహికల్ ఇన్‌స్పెక్టర్ నేరుగా వాహనాన్ని నడపడంతో పాటుగా 34 నిబంధనలు కచ్చితంగా ఉన్నాయా ? లేదా ? అన్న విషయాలను పరిశీలించిన తర్వాత మాత్రమే సామర్థ్య అర్హత ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ ప్రక్రియ పాఠశాలలు పున్ణ ప్రారంభమయ్యేలోపు పూర్తి కావాలని ఆదేశాలు జారీ చేసింది. కానీ విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటికీ అనేక బస్సులు సామర్థ్య పరీక్షలు చేయించుకోలేదు. నిబంధనల విషయంలో అధికారులు రాజీపడక పోవడమూ దీనికి ఓ కారణంగా చెప్పొచ్చు. పొరుగు రాష్ట్రాలలో తక్కువ ధరకు డొక్కు బస్సులను కొనుగోలు చేసి వాటికి పైపై సోకులు చేసి బస్సులు నడుపుతున్న యాజమాన్యాలు వాటిని సామర్థ్య పరీక్షకు తీసుకు వెళ్లడానికి భయపడుతున్నాయి. ఇలాంటి వాటిని ప్రారంభంలోనే సామర్థ్య పరీక్షలకు తీసుకెళ్తే అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తారని, గడువు ముగిసిన తర్వాత తీసుకెళ్తే పైపైన చూసి వదిలేస్తారనే భావనతో వీరంతా ఉద్దేశ పూర్వకంగానే ముందుకు రావడం లేదని తెలుస్తోంది. ప్రభుత్వం కొత్త నిబంధనలు పెట్టిందని కొన్ని పాఠశాలల నిర్వాహకులు విద్యార్థుల రవాణా రుసుములను అడ్డగోలుగా 30 నుంచి 50 శాతం వరకు పెంచేసినట్టు పలువురు చెబుతున్నారు.

నెల రోజుల నుంచి బస్సులకు సామర్థ్య పరీక్షలు పూర్తి చేసుకోవాలని రవాణా శాఖ అధికారులు మిగతా 2లో..

నోటీసులు జారీ చేశాం

పాఠశాలలు తెరిచేలోపు బస్సులకు సామర్థ్య పరీక్షలు నిర్వహించుకోవలసి ఉంది. నిర్లక్ష్యంగా ఉన్న వారికి ఈ విషయమై ఇప్పటికే నోటీసులు జారీ చేశాం. పలు యాజమాన్యాలు స్పందించలేదు. సామర్థ్య పరీక్షలు పూర్తి కాకుండా పాఠశాల బస్సులు రోడ్లపై తిరిగితే వాటిని సీజ్ చేస్తాం. పట్టుబడిన బస్సుల యజమాన్యం, బస్సు డ్రైవర్ ప్రాసిక్యూషన్ ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇప్పటికే తనిఖీలు చేపడుతున్నాం.

వేణుగోపాలరావు, ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ



ప్రతిభ చూపిన విద్యార్థులతో కలెక్టర్ మల్లికార్జున తదితరులు

విద్యలో కేరళ స్థాయికి చేరాలి

విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దేశంలో అన్ని రాష్ట్రాల కంటే విద్యలో ముందున్న కేరళ వలే ఆంధ్రప్రదేశ్ కూడా ఆ రంగంలో ముందు వరుసలో ఉండాలని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 'ఆణిముత్యాలు' పేరుతో సత్కార కార్యక్రమాన్ని శనివారం పాత నగరంలోని మేరీ పాఠశాలలో నిర్వహించారు. జిల్లా స్థాయిలో 600కు 570కి పైగా మార్కులు సాధించిన పదో తరగతి విద్యార్థులు 63 మందిని ఆణిముత్యాలు కార్యక్రమంలో సత్కరించి సర్టిఫికెట్లు, ప్రైజ్ మనీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది రాష్ట్ర స్థాయిలో విశాఖ జిల్లా పదో తరగతి ఫలితాలకు సంబంధించి ఏడో స్థానంలో ఉండగా, ఈసారి మూడో స్థానానికి చేరిందని, అందుకు కృషి చేసిన విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు తమ డిఫెన్స్ అకాడమీ, రామబాణం విద్యాసంస్థల్లో మిగతా 2లో..

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

వార్త 8లో..

ముదుర్తిలో విషాదఛాయలు

వార్త 6లో..

సమ్మె నిర్ణయంలో మార్పు లేదు

వార్త 2లో..



ఎక్స్‌పోలో స్టాల్స్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

కాంటెక్ ఎక్స్‌పో కిటకిట

నేటితో ముగియనున్న ప్రదర్శన వార్త మెయిన్‌లో..

పెంచిన విద్యుత్ ఛార్జీలపై పోరాటం

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి - అనకాపల్లి : ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలపై పోరాటాన్ని ఉధృతం చేస్తామని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం అన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలపై శనివారం సిఐటియు అనకాపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో సంఘం కార్యాలయంలో సదస్సు జరిగింది. దీనికి సిఐటియు మండల ఉపాధ్యక్షులు గంటా శ్రీరామ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కె.లోకనాథం ఈ సందర్భంగా మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల అమలుపై అన్ని రాష్ట్రాలపై ఒత్తిడి తెచ్చిందన్నారు. ఈ క్రమంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎపిలో ఆగమేఘాల మీద విద్యుత్ సంస్కరణలు అమలు చేసిందని, దీని వల్ల రాష్ట్ర ప్రజలపై వేల కోట్ల రూపాయలు విద్యుత్ భారాలు పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు రోజురోజుకూ ఉపాధి కరువై ప్రజలు ఆర్థిక ఇబ్బందులు పడుతుంటే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ అడుగులకు మడుగులొత్తుతున్న జగన్మోహన్ రెడ్డి కరెంటు ఛార్జీల భారం ప్రజల మీద వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్తు రంగంలో అదానీ కంపెనీకి మిగతా 2లో..



సదస్సులో మాట్లాడుతున్న లోకనాథం

మొదటి పేజీ తరువాయి..

భద్రతపై అలసత్వం

ఆదేశాలు ఇచ్చినప్పటికీ పాఠశాలల యాజమాన్యాలు ఏమాత్రమూ పట్టించుకోవడం లేదు. ప్రతి ఏటా మే 15 నుంచి జూన్ 12లోపు పాఠశాలలు ప్రారంభమయ్యేసరికి అన్ని పాఠశాలల, కళాశాలల బస్సులకు సామర్థ్య పరీక్షలు చేయించాలి. గడువు ముగిసినప్పటికీ చాలా బస్సులు సామర్థ్య పరీక్షలు నిర్వహించుకోలేదు. పాఠశాలలు తెరవకముందే ఫిట్‌నెస్ ప్రక్రియకు హాజరైతే ఏమైనా లోపాలు ఉంటే సవరించుకోవచ్చని అధికారులు చెప్పినప్పటికీ యాజమాన్యాలు ఎటువంటి చర్యలు తీసుకోలేలు. ఇప్పుడు ఒకేసారి వందల సంఖ్యలో బస్సులు సామర్థ్య పరీక్షల కోసం వస్తుండడంతో సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

తనిఖీల్లో వెలుగు చూస్తున్న అంశాలు

– స్పీడ్ గవర్నర్‌ను రెన్యువల్ చేయకుండా పాత వాటినే ఉంచుతున్నారు.

– బస్సుల కిటికీలకు మూడు వరుసలలో ఇనుప ఊచలు ఉంచాలి. కానీ రెండు వరుసలు ఉంటున్నాయి.

–పిల్లలు బస్సులోకి సులువుగా ఎక్కేలా మెట్లు ఉండాలి. మొదటి మెట్టు భూమి నుంచి 325 మిల్లీమీటర్ల ఎత్తు మించకూడదు. చాలా బస్సుల్లో ఈ ప్రమాణాలను పాటించటం లేదు.

–డోర్ లాక్ సరిగా పనిచేయకపోవడం ఎక్కువ బస్సుల్లో కనిపిస్తోంది.

– సీట్లు చిరిగిపోయి అధ్వానంగా ఉంటున్నాయి.

– బస్సు ముందు, వెనుక, మధ్యలో ఏర్పాటు చేయవలసిన రేడియం స్టిక్కర్లు సరైన రీతిలో ఉండటం లేదు.

– ప్రథమ చికిత్స పెట్టె అలంకారప్రాయంగా ఉంటోంది. అందులో మందులు, ఇతర వస్తువులు ఉండటం లేదు. అగ్నిమాపక సిలిండర్‌లో గ్యాస్ ఉండటం లేదు.

– బస్సులో కూర్చున్న విద్యార్థులు కదలకుండా ముందు ఉండవలసిన సపోర్ట్ రాడ్డులు సక్రమంగా లేవు.

– బస్సు చక్రాలు కొన్ని అరిగిపోవడం, రంగులు సక్రమంగా లేకపోవడం వంటివి తనిఖీల్లో ఎక్కువగా బయటపడుతున్నాయి.

ఇప్పటి వరకూ ఫిట్‌నెస్ పొందిన బస్సుల వివరాలు

విశాఖ జిల్లాలో మొత్తం పాఠశాలల బస్సులు 1291

ఇప్పటివరకూ ఫిట్‌నెస్ పొందినవి 920

ఇంకా ఫిట్‌నెస్ పొందవలసినవి 371

పెంచిన విద్యుత్ ఛార్జీలపై పోరాటం

అనుకూలంగా కరెంటు రేట్లు విపరీతంగా పెంచి స్మార్ట్ మీటర్ల కాంట్రాక్టు అప్పగించారని తెలిపారు. దీని వల్ల భారీగా కరెంటు ఛార్జీలు పెరిగాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో సామాన్య ప్రజానీకం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇంటి యజమానులు వినియోగించిన కరెంట్ బిల్లులకు అదనంగా అనేక రకాలైన ఛార్జీలు మోపుతున్నారన్నారు. వినియోగదారుల నుంచి విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ ప్రతి ఏడాదీ పెంచుతున్న ఛార్జీలకు అదనంగా ఇంకొన్ని ఛార్జీలు కలిపి దొడ్డిదారిన బిల్లుల్లో వేస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటు విద్యుత్ సంస్థలకు లబ్ధి చేకూర్చే విధంగా ఒప్పందాలు చేసుకుంటున్నాయని తెలిపారు. పెరుగుతున్న విద్యుత్ భారాలపై రాష్ట్ర వ్యాప్త పోరాటానికి అందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు రుత్తల శంకరరావు మాట్లాడుతూ ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుదలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గోరుచుట్టుపై రోకలి పోటులా విద్యుత్ ఛార్జీలు కూడా వారిపై పడ్డాయన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎ.బాలకృష్ణ, భీశెట్టి అప్పారావు, కాపుశెట్టి అప్పారావు, సురేష్, నరసింగరావు,తదితరులు పాల్గొన్నారు.

విద్యలో కేరళ స్థాయికి చేరాలి

చేరితే వారికి ఉచితంగా విద్య అందిస్తామన్నారు. కార్యక్రమంలో జివిఎంసి మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, మత్స్యకార కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ కోలా గురువులు, నెడ్ క్యాప్ ఛైర్మన్ కెకె.రాజు, క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ ఛైర్మన్ జాన్ వెస్లీ, శ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానం ఛైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ, కార్పొరేటర్ మహమ్మద్ సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

షైన్ 100 మోటార్ సైకిల్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రముఖ మోటారు కంపెనీ హోండా నూతనంగా తయారుచేసిన షైన్100 సిసి మోటార్ సైకిల్‌ను విశాఖలో టూ వీలర్స్ అధీకృత డీలర్ శ్రీ విష్ణుప్రియ మోటార్స్‌లో శనివారం విడుదల చేశారు. ఇసుకతోట శ్రీ విష్ణు ప్రియ మోటార్ మెయిన్ హోండా షోరూమ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో కంపెనీ అధికారులు, కస్టమర్లు, ఆహ్వానితుల సమక్షంలో షైన్ 100 సిసి మోటార్ సైకిల్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షోరూం అధినేత నాగుల బండి రంగా మాట్లాడుతూ అత్యంత ప్రజాదరణ పొందిన షైన్ 125 సిసి జైత్రయాత్రకు గుర్తింపుగా అతి సామాన్య వినియోగదారుడికి అందుబాటులో ఈ వాహనాన్ని అత్యంత తక్కువ ఎక్స్ షోరూమ్ ధర రూ.66,300తో, ఆధునాతన ఫీచర్లతో అందించడం ఆనందంగా ఉందన్నారు. ఇదే కార్యక్రమంలో యూనికాన్ 160 సిసి ఒబిడి టు, పది సంవత్సరాల హోండా ఎక్స్టెండెడ్ వారంటీ ప్లస్‌ను కూడా ఆవిష్కరించారు. డీలర్ షిప్ జనరల్ మేనేజర్ వి.నారాయణ సర్వీస్ మేనేజర్ గోవింద్, హోండా అధికారులు శరత్ ఉండే, రాహుల్ కుమార్ శేఖర్, ఈరన్న గౌడ పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులకు సంస్కరణల పోటు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

ప్రాథమిక విద్య క్రమంగా పేదలకు దూరమవుతోంది. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రకటిత లక్ష్యాలను నూతన విద్యా విధానం దెబ్బతీస్తోంది. విద్యా రంగంలో తీసుకొచ్చిన మార్పులు ప్రభుత్వ బడుల్లో ఎటువంటి ప్రభావం చూపుతాయో, వాటి పర్యవసానాలు ఎలా వుంటాయో కనీసం ప్రభుత్వం ఆలోచించలేదు. అనుభవంతో నిపుణులు చెప్పిన విషయాలు వినకుండా దూకుడుగా అమలుచేయడంతో వాటి దుష్ఫలితాలు ప్రభుత్వ ప్రాథమిక విద్యారంగంలో కనబడుతున్నాయి. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో సమీపంలోని 279 ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో ప్రభుత్వం విలీనం చేసింది. 23 ప్రాథమిక పాఠశాలలను ప్రాథమికోన్నత పాఠశాలలో కలిపింది. 28 ప్రాథమికోన్నత పాఠశాలల్లోని 6, 7, 8 తరగతులను మూడు కిలోమీటర్ల పరిధిలోని ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసింది. 2021లో 250 మీటర్ల పరిధిలోని 141 ప్రాథమిక పాఠశాలలను విలీనం చేసింది. మూడు కిలోమీటర్ల పరిధిలోని మూడు, నాలుగు, ఐదు తరగతుల విలీనంపై ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో ఆ పరిధిని కుదించింది. మూడు కిలోమీర్ల పరిధిలోని ఉన్నత పాఠశాలల తరగతులను



ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసింది. గ్రామానికి అందుబాటులో ప్రభుత్వ ప్రాథమిక విద్య వుండాలన్న విద్యా హక్కు చట్ట స్ఫూర్తికి భిన్నంగా మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానాన్ని జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం యథాతథంగా అమలుచేస్తోంది. మూడు, నాలుగు, ఐదు తరగతులను హైస్కూళ్లలో విలీనం చేయడం సరికాదని, విద్యార్థులు మానసికంగా ఇమడలేరని విద్యారంగ నిపుణులు నెత్తీనోరుకొట్టుకొని చెప్పినా ప్రభుత్వం వినలేదు. చిన్న పిల్లలకు సబ్జెక్టు టీచర్లు బోధిస్తే తప్పేంటని వితండవాదనకు దిగింది. మొండిగా మాట్లాడింది. ఈ ఏడాది 98 మంది కంటే తక్కువ విద్యార్థులున్న ప్రాథమికోన్నత పాఠశాలల్లో రేషనలైజేషన్ పేర సబ్జెక్టు టీచర్ పోస్టులను ప్రభుత్వం రద్దు చేసింది. 6, 7, 8 తరగతుల విద్యార్థులకు సబ్జెక్టు టీచర్లులేకపోతే ఎలా అంటే.. తక్కువ మంది విద్యార్థులకు సబ్జెక్టు టీచర్లెందుకు అని ఎదురుతిరిగి కుతర్కానికి దిగుతోంది. ఉపాధ్యాయ బదిలీల్లో కూడా ఖాళీలను బ్లాక్ చేసి మైదాన ప్రాంత ఉపాధ్యాయులను జిఒ 3 అమల్లో లేకపోవడంతో ఏజెన్సీ ప్రాంతానికి బదిలీచేసి ఉపాధ్యాయుల ఉసురుపోసుకుంది.

సమ్మె నిర్ణయంలో మార్పు లేదు

స్పష్టం చేసిన జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు



మాట్లాడుతున్న వెంకటరెడ్డి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మున్సిపల్ కార్మికుల డిమాండ్లను నెరవేర్చకుంటే ఈ నెల 19 నుంచి జరగబోయే సమ్మెలో ఎటువంటి మార్పూ ఉండబోదని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి యు.రాజు స్పష్టం చేశారు. శనివారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ కోవిడ్ తరువాత కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని యూనియన్‌కూ, అధికారులకూ మధ్య జరిగిన లిఖితపూర్వక ఒప్పందాలను జివిఎంసి ఉన్నతాధికారులు వాయిదాలు వేసుకుంటూ రావటం సరికాదన్నారు. జివిఎంసి కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలన్నారు. వారసత్వ పోస్టులను కార్మికుల బిడ్డలకే ఇవ్వాలని, టర్న్ కాక్, ఎలక్ట్రికల్, ఫిట్టర్ హెల్పర్లు, ఇంజినీరింగ్ కార్మికులకు, క్లాప్ డ్రైవర్లకు సెమీ స్కిల్డ్ వేతనం రూ.18,500 చెల్లించాలని అన్నారు. ప్రమాదకర వాయువులు పీలుస్తున్నటువంటి చెత్త తరలించే డ్రైవర్లు, మలేరియా, వెటర్నరీ కార్మికులు, యుజిడి కార్మికులకు హెల్త్ అలవెన్స్ చెల్లించాలన్నారు. ఈ నెల 19 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లామని ఇచ్చిన సమ్మె నోటీసు డిమాండ్లపై గత మూడు రోజులుగా యూనియన్ నాయకులతో అధికారులు చర్చలు జరిపారన్నారు. సిబ్బంది పెంపుదల, అదనంగా లోడర్లను తీసుకోవడం, క్లాప్ డ్రైవర్ల జీతాలు సమస్య, కో- ఆపరేటివ్ సొసైటీ రికవరీ, ప్రభుత్వ పథకాల అమలు, ఇతర ఇంజినీరింగ్ కార్మికుల డిమాండ్లపై మరింత స్పష్టత రావలసి ఉందన్నారు. కార్మికుల డిమాండ్లన్నీ నెరవేర్చేలా అధికారులు, ప్రభుత్వం స్పందించాలని విజ్ఞప్తి చేశారు. సమ్మె డిమాండ్లపై పూర్తిగా ఒప్పందం జరిగిపోయిందని అధికారులు, సంఘ విద్రోహ శక్తులు చేస్తున్న పుకార్లను నమ్మొద్దన్నారు. గందరగోళాలకు కార్మికులు గురికావొద్దని తెలిపారు. ఈ సమావేశంలో యూనియన్ అధ్యక్షులు టి.నూకరాజు, నాయకులు గొలగాని అప్పారావు, జెఆర్.నాయుడు, శంకర్ రెడ్డి, వెంకటరావు, ఇ.ఆదినారాయణ, శ్రీను పాల్గొన్నారు.

'న్యూగో'లో ప్రయాణం ఆహ్లాదకరం

ఎంవిపి.కాలనీ : గ్రీన్ సెల్ మొబిలిటీ ఎలక్ట్రిక్ బస్సు 'న్యూగో'లో ప్రయాణం విమాన ప్రయాణ అనుభవాన్ని అందిస్తుందని గ్రీన్ సెల్ మొబిలిటీ సిఇఒ, ఎమ్‌డి దేవేంద్ర చావ్లా తెలిపారు. శనివారం ఉదయం బీచ్ రోడ్‌లో నిర్వహించిన ఎలక్ట్రిక్ వాహనాల అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భద్రత, స్టేట్ ఆఫ్‌ఆర్ట్ సాంకేతికత, అసాధారణమైన సేవలపై దృష్టి పెడుతూ పూర్తిగా సంతృప్తికి ప్రాధాన్యం ఇస్తున్నట్టు తెలిపారు. బస్సును ట్రాక్ చేసేందుకు, ఏవైనా అనుకోని సంఘటనలు జరిగినప్పుడు డ్రైవర్లు సమయానుకూలంగా స్పందించేందుకు అనువైన వ్యవస్థలు దీనిలో ఉన్నాయన్నారు.

జిఒ 3ని పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: గిరిజనులకు ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పించే జిఒ నెంబర్ 3ని పునరుద్ధరించాలని గిరిజన సంఘం నాయకులు కొర్ర నర్సయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

వాల్తేర్ డివిజన్‌లో రైళ్ల రద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వాల్తేర్ డివిజన్‌లో ఆధునీకీకరణ పనుల కారణంగా జూన్ 18న 07469 విజయనగరం – విశాఖపట్నం ప్యాసింజర్, 07470 విశాఖపట్నం – పలాస ప్యాసింజర్, 07471 పలాస – విశాఖపట్నం ప్యాసింజర్, 07468 విజయనగరం – విశాఖపట్నం ప్యాసింజర్ రైళ్లను, జూన్ 19న 07469 విజయనగరం – విశాఖపట్నం ప్యాసింజర్, 07470 విశాఖపట్నం – పలాస ప్యాసింజర్, 07471 పలాస – విశాఖపట్నం ప్యాసింజర్, 07467 విశాఖపట్నం – రాజమండ్రి ప్యాసింజర్ రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె.త్రిపాఠి తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

20న జగన్నాథ రథయాత్ర

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఇస్కాన్ విశాఖపట్నం శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 20న జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తున్నట్టు ఇస్కాన్ స్థానిక అధ్యక్షులు సాంబదాస్ తెలిపారు. శనివారం నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఏర్పాట్లు వివరాలను తెలియజేశారు. రథయాత్రకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

సమ్మెకు పారిశుధ్య కార్మికులు సిద్ధం

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ పరిధిలో ఉన్న పారిశుధ్య కార్మికులు ఈ నెల 19వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు సిద్ధమవుతున్నారు. పెరుగుతున్న పట్టణ జనాభాకు సరిపడా పారిశుధ్య కార్మికులను ప్రభుత్వం నియమించాలని, కౌన్సిల్ తీర్మానం ప్రకారం కార్మికుల వారసత్వ పోస్టులను సంబంధిత కార్మిక కుటుంబంలోని వారికే ఇవ్వాలని, పని భారం తగ్గించాలని తదితర డిమాండ్లపై సమ్మెలోకి వెళు తున్నారు.

భీమిలిలో పరిధి ఎక్కువ... కార్మికులు తక్కువ...

జివిఎంసి ఒకటో జోన్ పరిధి 4 వార్డుల్లో ప్రస్తుత జనాభా 86,519 మంది ఉన్నారు. 58.14 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం ఉంది. 52 మురికి వాడలు ఉన్నాయి. ఇంత విస్తీర్ణం, అధిక జనాభా ఉన్నా పర్మినెంట్ పారిశుధ్య కార్మికులు కేవలం 26 మంది మాత్రమే ఉన్నారు. ఇందులో ముగ్గురు మేస్త్రిలు ఉన్నారు. 130 మంది పారిశుధ్య కార్మికులు అవుట్ సోర్సింగ్ పద్ధతిన పని చేస్తున్నారు. తక్కువ మంది కార్మికులతో, ఎక్కువ పని చేయిస్తుండడంతో వీరిపై పని భారం పడుతోంది.

రోజు వారీ 30 టన్నుల చెత్త సేకరణ..

భీమిలి జోన్‌లో ఒక్కో క్లాప్ వాహనం ద్వారా తడి, పొడి, ప్రమాద కర చెత్తను రోజుకు1000 నుంచి 1420 కిలోలను పారిశుధ్య కార్మికులు సేకరిస్తున్నారు. పట్టణంలోని ప్రధాన రోడ్లతో పాటు మురికి వాడలు, వీధుల్లో ఉన్న రోడ్లు, కాల్వలను శుభ్రం చేస్తూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న పారిశుధ్య కార్మికుల సమ్మెకు సిఐటియు మద్దతుగా నిలిచింది. ప్రజలు కూడా సమ్మెకు మద్దతునీయాలని సిఐటియు నాయకులు కోరుతున్నారు.

జెడ్సీకి సమ్మె నోటీసు

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) భీమిలి జోన్ నాయకులు శనివారం జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాముకు అతని కార్యాలయంలో కలిసి నోటీసు అందజేశారు. యూనియన్ నాయకులతో పాటు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు. కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పనిచేసిన పారిశుధ్య కార్మికులను ప్రభుత్వం ఏ మాత్రమూ పట్టించుకోలేదని సమ్మె నోటీసులో పేర్కొన్నారు. కరోనా సమయంలో 18 మంది కార్మికులు విధుల్లో ఉంటూ మృతి చెందారని, సిఎం జగన్మోహన్‌రెడ్డి ఒక్కో కుటుంబానికి ఇస్తామని హామీ ఇచ్చిన రూ 4లక్షలు, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఇస్తామని హామీ ఇచ్చిన రూ.50 లక్షల్లో రూపాయి సాయం కూడా అందలేదన్నారు. పారిశుధ్యం పేరు చెప్పి ప్రజల నుంచి చెత్త పన్ను నెలకు రూ.5 కోట్లు వసూలు చేస్తున్నారని వివరించారు. దాదాపు 30 ఏళ్లుగా సేవలందిస్తున్న కార్మికులకు ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా సర్వీస్ బెనిఫిట్స్ చెల్లించలేదని పేర్కొన్నారు. తప్పని సరి పరిస్థితుల్లో సమ్మెకు వెళ్తున్నట్లు తెలిపారు. సమ్మె నోటీసు అందజేసిన వారిలో యూనియన్ జోన్ అధ్యక్షులు ఆర్ఎస్ఎన్.మూర్తి, నాయకులు ఉన్నారు.



జోనల్ కమిషనర్ రాముకు సమ్మె నోటీసు ఇస్తున్న యూనియన్ నాయకులు

పదిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహకం



నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్న కార్పొరేటర్ కెల్ల సునీత

ప్రజాశక్తి - ఆరిలోవ : శ్రీకృష్ణాపురం గురుకుల పాఠశాలలో పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత హాజరై పాఠశాలలో ప్రథమ స్థానం పొందిన దేముడు బాబుకు రూ.3వేలు, ద్వితీయ స్థానం పొందిన తరుణ్ శ్రీదేవ్‌కు రూ.2 వేలు, తృతీయ స్థానం పొందిన ప్రసాద్‌కు రూ.1,000 అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కెల్ల సునీత మాట్లాడుతూ, ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని క్రమ శిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అందుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ బికె.రమేష్, వైసిపి నాయకులు వెంకట రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షపై దిశా నిర్దేశం



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ వేణుగోపాల్

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఈ నెల 23వ తేదీన ప్రారంభం కానున్న జగనన్న సురక్ష పథకం లక్ష్యాన్ని వివరిస్తూ మండల పరిధిలోని వివిధ విభాగాల అధికారులకు శనివారం స్థానిక ఎండిఒ కార్యాలయంలో జరిగిన సమావేశంలో దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి తహశీల్దార్ కోరాడ వేణుగోపాల్ మాట్లాడుతూ, ఈ నెల 24 నుంచి 30వ తేదీ వరకు వివిధ పథకాలకు అర్హత కలిగిన లబ్ధిదారుల పేర్లను ఇంటింటికీ వెళ్లి సేకరించాలని చెప్పారు. మండల కమిటీల పర్యవేక్షణలో ఆయా లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. పథకం విధి విధానాలు వివరించారు. ఈ సమావేశంలో పంచాయతీ విస్తరణాధికారి జి.అప్పలరాజు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం మండలంలో 13 సచివాలయాలు ఉండగా, ఇందులో 9 సచివాలయాల పరిధిలో లబ్ధిదారుల గుర్తింపు, దరఖాస్తుల స్వీకరణకు ఎండీఒ వి.వెంకటరమణ, మిగిలిన 4 సచివాలయాల పరిధిలో లబ్ధిదారుల గుర్తింపు, దరఖాస్తుల స్వీకరణకు తహశీల్దార్ కోరాడ వేణుగోపాల్ పర్యవేక్షణలో కమిటీలు ఏర్పాటుచేశారు.

ఆనందపురం: ఆనందపురం మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిడిఒ అడప లవరాజు ఆధ్వర్యాన 'జగనన్న సురక్ష' పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆనందపురం మండల పరిధిలో ఉన్న 18 సచివాలయాల సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వాలంటీర్లు తమ పరిధిలో ఉన్న అన్నీ కుటుంబాలను సందర్శించి వారి సమస్యలను సచివాలయానికి అందజేయాలని తెలిపారు. ఆ సమస్యలను శాఖల వారీగా పరిష్కరించే దిశగా మండల స్థాయి అధికారులు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అడప లవరాజు, ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డి కరుణాకర్‌రావు, కార్యదర్శులు శ్రీరామ్‌మూర్తి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు

ప్రజాశక్తి- ఆనందపురం: గ్రామ సచివాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు తహశీల్దార్ లోకవరపు రామారావు తెలిపారు. రీ సర్వే పూర్తయిన కనమాం, ఎంజిఆర్.పురం గ్రామ సచివాలయాల్లో శనివారం రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్నవారికి ప్రత్యేక ఉప కలెక్టర్ కె.సత్యపద్మ ద్వారా రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 12వ వార్డు పరిధిలో జగనన్న ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు శనివారం పంపిణీ చేశారు. వార్డు పరిధి ఆరిలోవ పోలీస్‌స్టేషన్ వెనుక భాగంలో ఉన్న సచివాలయంలో జరిగిన కార్యక్రమానికి వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి ముఖ్యఅతిథిగా హాజరై సుమారు 123 మంది లబ్ధిదారులకు పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతిపక్షం ఎన్ని విమర్శలు చేసినా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పేదలందరికీ సొంతంటి కళ నెరవేర్చడమే ధ్యేయంగా పనిచేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తి మందారెడ్డి, పి.బాలరాజు, సూర్యారావు, పాపారావు, సుజాత, హుస్సేన్, మోహన్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో ముత్తంశెట్టి

ప్రజాశక్తి-సింహాచలం: ప్రతిఏటా వర్షా బావ పరిస్థితి ఏర్పడినప్పుడు సింహాచలం దేవస్థానంలో యాగం జరిపి వరద పాయసం పోయడం ఆనవాయితీగా వస్తోందని, ఆ మాదిరిగానే ఈ ఏడాది ప్రత్యేక పూజలు జరపాలని శనివారం అప్పన్నను దర్శించుకునేందుకు వచ్చిన భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సూచించారు.

సింహాచలం దేవస్థానానికి దర్శనం కోసం వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. వీరు ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయం, గోదాదేవి సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిపారు. ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించారు. .

రేపు విద్యుత్ సరఫరా బంద్

ప్రజాశక్తి -పిఎం పాలెం : జోన్ - 3 ఆపరేషన్ ఇఇ పోలాకి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు 11 కెవి స్టేడియం ఫీడర్, పెప్సీ ఫీడర్ మరమ్మత్తుల నిమిత్తం సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పిఎం.పాలెం సబ్‌స్టేషన్ ఎఇఇ మండల అప్పలనాయుడు తెలిపారు. బాబా నగర్, సాంకేతిక కళాశాల, వెంకటేశ్వర స్వామి టెంపుల్ ఏరియా, తులసి నగర్ తదితర ప్రాంతాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నేరాలు ఘోరాలు

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : మండలంలోని కె.పి. అగ్రహారం గ్రామం శివారున శనివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా పి.భీమవరం వైపు నుండి వడ్డాది గ్రామానికి చెందిన ఆది మురళి అనే వ్యక్తి ఎపి 24 టిఎ 7557 నెంబర్ గల ట్రాక్టర్‌పై ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను రవాణా చేస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ కుమారస్వామి తెలిపారు. ట్రాక్టర్ యజమానికి రూ.13వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

ప్రజాశక్తి- చోడవరం: మండలంలో జన్న వరం గ్రామంలో నేమాల సూరిబాబు(50) అనే రైతు తన పొలంలో విద్యుత్తు వ్యవసాయ పంపుసెట్ ఆన్ చేస్తుండగా విద్యుత్తుషాక్‌కు గురై గురై శనివారం మధ్యాహ్నం మృతి చెందాడు. శనివారం మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత పొలానికి నీరు వదలడానికి మోటారును ఆన్ చేసిన సూరిబాబు, స్టార్టర్ స్విచ్‌ను తాకగానే షాక్‌కు గురికావడంతో మృత్యువాత పడ్డాడు. మృతునికి భార్య, కుమారుడు కుమార్తె ఉన్నారు.

గ్రావెల్ తరలింపు ఫిర్యాదుపై పరిశీలన

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం, చిప్పాడ కొండను తవ్వేసి గ్రావెల్ అక్రమంగా తరలిస్తున్నట్లు అందిన వరుస ఫిర్యాదులపై రెవెన్యూ, మైన్స్ విభాగం అధికారులు శని వారం సంబంధిత స్థలాన్ని పరిశీలించారు. గ్రావెల్ తవ్వకానికి రెవెన్యూ, మైన్స్ అధికారుల అనుమతులు ఏమైనా ఉన్నాయా? గ్రావెల్ తరలింపు వెనుక ఉన్నది ఎవరు? సొంత ఆర్థిక పరమైన ప్రయోజనాలకు గ్రావెల్ తరలిస్తున్నారా? అన్న అంశాలను పరిశీలించినట్లుగా తెలిసింది. అదే ప్రాంతంలో మూడు ట్రాక్టర్లతో గ్రావెల్ తరలిస్తున్నారన్న సమాచారంతో శుక్రవారం రాత్రి చిప్పాడ విఆర్ఒ పి.శ్యామ్‌సుందర్ ఆధ్వర్యాన సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. కొండపై పేదలకు జగనన్న ఇళ్ళ స్థలాల నిర్మాణంలో భాగంగానే స్థలం చదును చేసుకునే నిమిత్తం గ్రావెల్‌ను తరలిస్తున్నట్లు కొందరు, గ్రావెల్ అక్రమంగా తరలిస్తూ ఆర్థిక ప్రయోజనం పొందుతున్నారని ఇంకొందరు తమ వద్ద భిన్న వాదనలు వినిపించారని విఆర్ఒ శ్యామ్‌సుందర్ చెప్పారు. వాస్తవం ఏమిటన్నది రెవెన్యూ, మైన్స్ విభాగాల అధికారుల విచారణలో తేలనుందని అన్నారు.

గ్రామ దేవతల ఆలయాభివృద్ధికి రూ.కోటి కేటాయించండి

ప్రజాశక్తి-సింహాచలం: సింహాచలం దేవస్థానం ఉపాలయాలైన పైడితల్లమ్మ, బంగారమ్మ దేవాలయాల అభివృద్ధికి రూ.కోటి కేటాయించాలని ఇన్‌ఛార్జి ఇఒ డి.భ్రమరాంబకు శనివారం ధర్మకర్తల మండలి సభ్యులు వినతిపత్రాన్ని సమర్పించారు. ఇటీవల పైడితల్లమ్మ పండగ ముందు జరిగిన గ్రామ సభలో తీర్మానం చేశామని, త్వరలో జరిగే ధర్మకర్తల మండలి సమావేశంలో ఈ తీర్మానం ప్రవేశపెట్టి నిధులు మంజూరు చేసి సహకరించాలని కోరారు. ఈ ఆలయానికి గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ప్రధానంగా పైడితల్లి అమ్మవారిని దర్శించినదే అప్పన్న దర్శనానికి వెళ్లరని గుర్తు చేశారు. బంగారమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి ఇప్పటికే ప్రతిపాదనలు చేసినట్లు శ్రీనుబాబు గుర్తు చేశారు. మంగళవారం భక్తులు భారీగా తరలివస్తారని, మరుగుదొడ్డి నిర్మించాలని సూచించారు.

వేళాపాళా లేని విద్యుత్ కోతలు

ప్రజాశక్తి -గాజువాక : పెదగంట్యాడ సబ్‌స్టేషన్ పరిధిలో వేళాపాలా లేకుండా ఇష్టానుసారంగా కరెంటు కోతలు పెడుతున్నారు. దీంతో స్థానికంగా ఉన్న ప్రజలు వేడిని తట్టుకోలేక ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఈ స్టేషన్ పరిధిలో 50 వేల మంది జనాభా నివాసముంటున్నారు. వారం రోజులుగా ఉదయం, రాత్రి సమయాల్లో ఎక్కువగా కరెంటు కోతలు పెడుతున్నారు. ప్రతిరోజూ రాత్రి రెండు గంటల తర్వాతనే కరెంట్ సరఫరా చేస్తున్నారు. దీంతో ప్రతిరోజూ విధులకు వెళ్లే ఉద్యోగస్తులు, రోజు కూలి చేసుకునే కార్మికులు, స్కూల్ పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రతిపాదనలకే పరిమితమైన సబ్ స్టేషన్ నిర్మాణం..

ప్రస్తుతం ఉన్న సబ్ స్టేషన్ ఇప్పటి జనాభా అవసరాలకు సరిపోవడంలేదని మరో సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థల సేకరణ చేశారు. మూడేళ్ళ గడుస్తున్నా నేటి వరకు సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టలేదు. రాత్రి సమయంలో ఓవర్ లోడ్ కారణంగా ప్రస్తుత సబ్‌స్టేషన్ లోడ్ సరిపోక ట్రిప్ అయిపోతుందని, అందుకే కరెంటు కోతలు చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. మరో సబ్ స్టేషన్ నిర్మాణం జరిగితే తప్ప ఈ సమస్యను పరిష్కారం చేయలేమని అధికారులు తేల్చి చెప్పారు.

పాలు, పెరుగు చెడిపోతున్నాయి

అమ్మకం చేయగా ఉన్న పాలు, పెరుగు ఫ్రిజ్‌లో పెడితే కరెంట్ సరఫరా లేని కారణంగా అవి చెడిపోతున్నాయి. రోజులో గంట సమయం కూడా కరెంట్ సరఫరా చేయడం లేదు. రాత్రి రెండు గంటలకు కరెంట్ వచ్చింది.



కృష్ణ,
పాల బూత్ వ్యాపారి

వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు

ఇష్టానుసారం కరెంటు కోతలు కారణంగా ఇంట్లో ఉన్న వృద్ధులు, పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి రెండు గంటల వరకు కరెంట్ లేని కారణంగా ఉదయం లేచి పనిచేయలేక నీరసంగా ఉంటోంది. వారం రోజులుగా నిద్ర సరిగా లేదు.



విష్ణు,
మెకానిక్.

రాత్రి వేళ కరెంట్ కోతలు ఎత్తివేయాలని వినతి



ఎఇకి వినతిపత్రం అందజేస్తున్న ముత్యాలు

ప్రజాశక్తి -గాజువాక : రాత్రివేళ కరెంటు కోతలు ఎత్తివేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన శనివారం ఎఇకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ముత్యాలు మాట్లాడుతూ, పెదగంట్యాడ మండల పరిధిలోని గ్రామాల్లో 10 రోజులు నుంచి పెడుతున్న రాత్రి వేళ కరెంట్ కోతలతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పగలు ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలు నమోదుతో పెద్దలు, పిల్లలు అనేక అవస్థలు పడుతున్నారని వివరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో యరబాల భూలోక, ఎం.వర్మ ఉన్నారు.

25వ వార్డులో కార్పొరేటర్ పర్యటన

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 25వ వార్డు బిటిఆర్ కాలనీ, రెల్లివీధిలో సమస్యలను తెలుసుకోడానికి వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యలపై ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎఇ శ్రీరామ్మూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సన్యాసి నాయుడు, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, సచివాలయ అడ్మిన్ రాజశేఖర్, సచివాలయ సెక్రటరీలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

పర్యావరణ హిత విశాఖగా తీర్చిదిద్దుదాం

ప్రజాశక్తి-సీతమ్మధార : పర్యావరణ సహిత విశాఖను తీర్చిదిద్దుదాం అని ఎన్ఎంపి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు రాంప్రసాద్ పిలుపునిచ్చారు. టిపిటి కాలనీలోని ఎన్ఎంపి హైస్కూల్లో "ప్రపంచ కరువు -ఎడారికరణ ఎదుర్కొనే దినం' సందర్భంగా శనివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాంప్రసాద్ మాట్లాడుతూ, ప్రపంచ కరువు ఎడారికరణ ఎదుర్కొనే రోజును ఐక్యరాజ్యసమితి నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్‌జి.ప్రభావతి, వరలక్ష్మి శ్రీనివాసరావు, రాధా దేవి, ఎస్.గీత, గ్రీన్ క్లైమేట్ ప్రతినిధి జెవి.రత్నం, మౌనిక పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణను విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి-సింహాచలం : అందరి సహకారంతో గిరిప్రదక్షిణ ఉత్సవాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేద్దామని సింహాచల దేవస్థానం ఇన్‌ఛార్జి ఈవో డి.భ్రమరాంబ పేర్కొన్నారు. శనివారం పరిపాలన భవన కార్యాలయంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. గిరిప్రదక్షిణ ఏర్పాట్లును ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరాజు వివరించారు. పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పూర్తిస్థాయిలో భాగస్వామ్యం అవుతామని ప్రకటించారు. పులిహోర, పొంగలి, దద్దోజనం, పాలు, మందులు, పండ్లు బిస్కెట్లు, మజ్జిగ, నీరు, అన్న ప్రసాదాలు ఏర్పాటుచేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, దేవస్థానం నిర్దేశించిన ప్రాంతాల్లో ఏర్పాటుచేసి సహకారం అందించాలని కోరారు. కాలినడకన సింహగిరికి చేరిన భక్తులకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు గంట్ల శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

కొయ్యపేటలో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని నెరెళ్ల వలస పంచాయతీ పరిధి కొయ్యపేట గ్రామంలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. స్థానిక సమస్యలనడిగి తెలుసుకున్నారు. విద్యుత్ కోత, తాగునీటి సమస్య, మురుగు కాలువల దుర్వాసన, వీధిలైట్లు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. ఈ సమస్యలపై ఆయన స్పందించి అధికారులతో చర్చించారు. నెల రోజుల్లో పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. అసంపూర్తిగా ఉన్న గ్రామ సచివాలయాన్ని పూర్తిచేయాలని స్థానిక సర్పంచులను ఆదేశించారు. దీనిపై సర్పంచ్ వెంకటరావు స్పందిస్తూ కోర్టు వివాదంలో సమస్య ఉందని, పరిష్కారమైతే పూర్తి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు గిరిబాబు, మండల పార్టీ ప్రెసిడెంట్ కోరాడ లక్ష్మణ, సన్యాసినాయుడు, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

'టిడిపి మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలి'

ప్రజాశక్తి -భీమునిపట్నం, ఆరిలోవ : మహానాడులో విడుదల చేసిన టిడిపి తొలి మేనిఫెస్టోను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నియోజక వర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో టిడిపి మండల అధ్యక్షులు డిఎఎస్.రాజు అధ్యక్షతన శనివారం మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోరాడ రాజబాబు మాట్లాడుతూ, ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేస్తే వచ్చే ఎన్నికల్లో టిడిపిదే అధికారం అన్నారు. అధికార వైసిపి బోగస్ ఓట్లను చేర్పించి, రాజకీయ లబ్ధి పొందాలన్న ప్రయత్నాన్ని క్షేత్ర స్థాయిలోనే అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సరగడ అప్పారావు, పతివాడ రాంబాబు, సంకురుభుక్త ప్రకాష్, తమ్మిన వెంకటరమణ పాత్రుడు, శివాజీ, పొట్నూరు రాము తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ : ఇటీవల తెలుగుదేశం పార్టీ ప్రకటించిన టిడిపి మేనిఫెస్టోపై 12వ వార్డు టిడిపి క్లస్టర్ ఇన్‌చార్జ్ ఒమ్మి అప్పలరాజు ఆధ్వర్యాన పెదగదిలి, ఈశ్వరి దేవినగర్‌లో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గాడి సత్యం, ఒమ్మి పోలారావు, గణేష్, జగదీష్, నూకరాజు, సత్యనారాయణ, దువ్వి తాతారావు పాల్గొన్నారు.

చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -తగరపువలస : తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ ఈ నెల 18వ తేదీన చేపట్టే చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని చేనేత ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు గిడుతూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి టి.అప్పారావు చేనేత కార్మికులకు విజ్ఞప్తి చేశారు.

శాస్త్రీయ ఆలోచనలకు జెవివి కృషి

ప్రజాశక్తి -గాజువాక : విద్యార్థులు శాస్త్రీయంగా ఆలోచించే విధంగా జన విజ్ఞాన వేదిక కృషిచేస్తోందని, ఆ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీధర్ తెలిపారు. జనవిజ్ఞాన వేదిక సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా సుందరయ్యకాలనీ గోల్ రవీంద్ర ఇండియన్ పబ్లిక్ స్కూల్లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మురళీధర్ మాట్లాడుతూ, జన విజ్ఞాన వేదిక మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా, విద్యార్థుల్లో ప్రశ్నించేతత్వం తదితరాలను పెంపొందిస్తోందని తెలిపారు. ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకోవాలని కోరారు. జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ ఎం.రమేష్‌కుమార్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం సిలబస్‌లో డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించిందని, దీనివల్ల విద్యార్థులు విజ్ఞానాన్ని కోల్పోతున్నారని పేర్కొన్నారు. నూతన విద్యా విధానం చాలా నష్టదాయకమన్నారు. ఎస్‌వికె.పరశురాం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కృష్ణారావు సింహాచలం పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జనవిజ్ఞాన వేదిక నాయకులు.

ఉత్సాహంగా స్కేటింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు



స్కేటింగ్ పోటీలను ప్రారంభిస్తున్న రాజన్ ప్రసాద్

ప్రజాశక్తి-పెందుర్తి : మురళీ రోలర్, ఐస్ స్కేటింగ్ అకాడమీ ఆధ్వర్యాన సుజాతనగర్‌లో సమ్మర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఇండో హ్యూమన్ రైట్స్ కేర్ నేషనల్ ఛైర్మన్ రాజన్ ప్రసాద్ హాజరై మాట్లాడారు. ఇటువంటి సమ్మర్ క్యాంపులు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి పెంపొందుతుందన్నారు. విద్యా పోటీ ప్రపంచంలో విద్యార్థులు క్రీడలకు దూరంగా ఉంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. క్రీడలతో పేరు ప్రఖ్యాతులు పెరుగుతాయని తెలిపారు. కోచ్ మురళి మాట్లాడుతూ, ఐదు టీములు నుంచి సుమారు 200 మంది పిల్లలు పాల్గొన్నారు పోటీల అనంతరం విజేతలకు బహుమతులు అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు, పిల్లలు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైసిపి యువజన విభాగ కమిటీల నియామకం

ప్రజాశక్తి-సీతమ్మధార : వైసిపి యువజన విభాగ రాష్ట్ర, జిల్లా మండల, వార్డు, స్థాయి కమిటీల నియామకాల ప్రక్రియ ప్రారంభించినట్లు ఆ విభాగం జిల్లా అధ్యక్షులు ఆళ్ళ శివ గణేష్ తెలిపారు. శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉత్సాహవంతమైన యువకులు, జగన్మోహన్‌రెడ్డి అభిమానులు ముందుకు రావాలని కోరారు. ఆయా ప్రాంతాల్లో నియోజకవర్గ శాసనసభ్యులు, సమన్వయకర్తల ద్వారా తనను గానీ, మద్దిలపాలెంలో గల పార్టీ కార్యాలయాన్ని సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం నాయకులు జీలకర్ర నాగేంద్ర పాల్గొన్నారు. యువజన విభాగ క్యాంపు కార్యాలయం 9963825252 నెంబర్‌నైనా సంప్రదించాలని కోరారు.

'ఉత్తరం'లో గ్రీవెన్స్

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు వైసిపి సమన్వయకర్త కెకె.రాజు శనివారం పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన పలువురు వచ్చి సమస్యలతో కూడిన వినతిపత్రాలను కెకె.రాజుకు అందించారు. వినతిపత్రాలను పరిశీలించిన కెకె.రాజు అధికారులతో మాట్లాడి కొన్నింటిని వెంటనే పరిష్కరించారు. మరికొన్నింటికి సంబంధించి అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, ఉష్మశ్రీ పాల్గొన్నారు.

ఇంగ్లీష్‌పై మెళకువలు

ప్రజాశక్తి-సీతమ్మధార : రంగసాయి నాటక గ్రంథాలయం ఆధ్వర్యాన ప్రత్యేక శిక్షణ ద్వారా ఇంగ్లీష్ భాషలో రాయడం, మాట్లాడంలో మెళకువలతో పాటు జ్ఞాపకశక్తి, ఏకాగ్రతను పెంపొందించే విధంగా ఉచిత శిక్షణా తరగతులను ఆదివారం ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రాం కన్వీనర్ బాదంగిర సాయి తెలిపారు. శిక్షణ రంగంలో 30 సంవత్సరాల అనుభవం కలిగిన రేవళ్ల మోహన్ ఈ శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు 9440458458, 7396747522 నెంబర్లకు ఫోన్ చేసి పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

లా సెట్‌లో గిరిజన విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -మధురవాడ : ఏపీ లాసెట్ ఫలితాల్లో మారికవలసలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల శిక్షణా సంస్థ విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచినట్లు ఆ సంస్థ ప్రిన్సిపల్ శివప్రసాద్ తెలిపారు. ఇక్కడ శిక్షణ పొందుతున్న విద్యార్థుల్లో లాసెట్ 2023 ప్రవేశ పరీక్షకు 18 మంది విద్యార్థులు హాజరయ్యారని చెప్పారు. ఈ ఫలితాల్లో జి.సందీప్ 1006 (జనరల్ కేటగిరీ) ర్యాంకును కైవసం చేసుకున్నాడు. ఎస్.మల్లేష్ 1017, బి.సాయిబాబు 1111, వి.బొంజుబాబు 1195వ ర్యాంకును కైవసం చేసుకున్నారు. 10 మంది విద్యార్థులు 1500 లోపు ర్యాంకులను సాధించగా, మొత్తం 18 మంది హాజరైన అందరూ అర్హత సాధించారని తెలిపారు.

వేళాపాళాలేని విద్యుత్ కోతలపై ఆందోళన



విద్యుత్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి - పరవాడ: మండలంలో అనధికార విద్యుత్ కోతల నివారించాలని శనివారం పరవాడ విద్యుత్ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి మాట్లాడుతూ వేళాపాళా లేని విద్యుత్ కోతలతో కార్మికులు, చిరు వ్యాపారులు, మధ్య తరగతి ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని, మరోవైపు ఎండల దెబ్బకు వృద్ధులు, పిల్లలు రాత్రి వేళల్లో నిద్రలేక అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. విద్యుత్ కోతలకు చెక్ పెట్టకపోతే, సబ్‌స్టేషన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆందోళనలో సిఐటియు నాయకులు కే హేమంత్, బి రమేష్, పి అప్పారావు, రమణ పాల్గొన్నారు.

కాపుల ద్రోహి మంత్రి అమర్‌నాథ్



మాట్లాడుతున్న పీల గోవింద సత్యనారాయణ

ప్రజాశక్తి -అనకాపల్లి : కాపుభవనం రద్దు చేస్తూ కేబినెట్లో మంత్రి అమర్నాథ్ సంతకం చేయడం ద్వారా కాపుల ద్రోహిగా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చరిత్రలో నిలిచిపోతారని మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణ ఆరోపించారు. శనివారం గవరపాలెంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడతుఊ, కాపు భవనంపై మంత్రి అమర్నాథ్ వైఖరి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. జివిఎంసి అధికారులు వైసిపి కార్యకర్తలుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కొత్తూరు నరసింహారావు పేటలో అక్రమంగా నిర్మిస్తున్న వైసిపి కార్యాలయాన్ని తొలగించకుంటే జీవీఎంసీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. దీనిపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా జివిఎంసి అధికారులకు పట్టకపోవడం శోచనీయమన్నారు. నాలుగు రోజులలోగా అక్రమ నిర్మాణాన్ని తొలగించకుంటే ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

శాశ్వత భూహక్కు పత్రాల పంపిణీ



భూహక్కు పత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని పెద గొల్లలపాలెం పంచాయతీ విప్పాక అగ్రహారం, అయ్యన్నపాలెం, రాయపుర అగ్రహారం గ్రామాల రైతులకు జగనన్న శాశ్వత భూహక్కు పత్రాలను స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న శాశ్వత భూహక్కు పథకం సమగ్ర భూరీ సర్వే ద్వారా ప్రభుత్వమే రైతుల భూములు సర్వే చేయించి, సరిహద్దులు గుర్తించి, సర్వే రాళ్లు నాటి వారి భూములకు వివాద రహితంగా శాశ్వత భూహక్కు పత్రాలను అందిస్తోందన్నారు. రానున్న రోజుల్లో భూముల రిజిస్ట్రేషన్లు గ్రామ సచివాలయాల్లో జరిగేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ బి. సత్యనారాయణ ఎంపీపీ బోకం సూర్యకుమారి రాము నాయుడు, జెడ్ పి వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, వైస్ ఎంపిపిలు శరగడం రూప్నీలక్ష్మిరాణి, చొక్కాకుల గోవింద, వైసిపి నేతలు కోటాన రాము, సబ్బవరపు ముత్యాల నాయుడు పాల్గొన్నారు.

తుమ్మపాల సుగర్స్‌ను తెరిపించేదెన్నడో..?



సెల్ఫీ చాలెంజ్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి- అనకాపల్లి : పాదయాత్రలో, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు తుమ్మపాల వివి రమణ సహకార చక్కెర కర్మాగారాన్ని వైసిపి ప్రభుత్వం తక్షణమే తెరిపించాలని కాంగ్రెస్ నేతలు కోరారు. శనివారం అనకాపల్లి వివి రమణ కోఆపరేటివ్ సుగర్స్ లిమిటెడ్‌ను సందర్శించిన కాంగ్రెస్ నాయకులు, వైసిపి నేతలకు సెల్ఫీ ఛాలెంజ్ విసిరారు. ఈ సందర్భంగా అనకాపల్లి అసెంబ్లీ ఇంచార్జి బోయిన భానుమూర్తి యాదవ్ మాట్లాడుతూ, విపక్షనేతగా ఉన్నప్పుడు ప్రస్తుత సిఎం జగన్, మంత్రి అమర్నాధ్ ఎన్నికల ప్రచారంలో జిల్లాలోని సుగర్స్‌ను ఆధునీకరిస్తామని మాటిచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత మడమ తిప్పారని ఎద్దేవా చేశారురూ. 500 కోట్ల రూపాయల ఆస్తులున్న తుమ్మపాల సుగర్స్‌ను మూతపడేలా చేయడం దారుణమన్నారు. చెరకు అభివద్ధి మండలి మాజీ డైరెక్టర్ కాళ్ళ వెంకటసత్యనారాయణ(ఏడు కొండలు) మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హయాంలో రైతులకు ఎప్పటికప్పుడు చెరకు పేమెంట్లు ఇచ్చే వారమని, తర్వాత తెలుగుదేశం ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా సుగర్ ఫ్యాక్టరీలకు గడ్డుకాలం వచ్చిందన్నారు. అనకాపల్లి అసెంబ్లీ కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు మలపురెడ్డి కోటేశ్వర రావు, సత్యనారాయణ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ సేనాపతి రాజు, టి సుబ్బిరామిరెడ్డి సేవా పీఠం మాజీ సభ్యులు కె వి మాణిక్యం (సుబ్బిరామి రెడ్డి) చెరకు రైతు పీలా జగదీశ్వరరావు పాల్గొన్నారు.

'అస్తవ్యస్త విధానాలతో విద్యారంగం అధోగతి'

ప్రజాశక్తి -అనకాపల్లి : వైసిపి ప్రభుత్వం విద్యను మిథ్యగా మార్చిందని, నీతి అయోగ్ సర్వే ప్రకారం తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మూడో స్థానంలో ఉంటే, జగన్ రెడ్డి ఆ స్థానాన్ని 19వ స్థాయికి దిగజార్చారని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీశ్ ఆవేదన వ్యక్తపరిచారు. శనివారం పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వ అనాలోచిత, ఏకపక్ష నిర్ణయాలతో కేంద్ర ప్రభుత్వం నివేదిక ప్రకారం లెర్నింగ్ అండ్ న్యూమరసీలో రాష్ట్రాన్ని 29వ స్థానానికి పతనం అయ్యేలా చేశారన్నారు. 5 అనకాపల్లి జిల్లాలో 26 వేల పేద విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రాష్ట్రాల్లో పిజి ప్రవేశాలు పెరుగుతుంటే, రాష్ట్రంలో తగ్గిపోతుండడం బలవంతంగా విద్యార్థులపై రుద్దుతూ మాతృభాషకు తూట్లు పొడవడం బాధాకరమన్నారమన్నారు. 60 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నా, వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క డిఎస్‌సి ప్రకటించలేదన్నారు. జిల్లాలో ఎయిడెడ్ పాఠశాల భూములను లాక్కోవడం, గతంలో మూడు కిలోమీటర్ల దూరం లోపు ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలో విలీనం చేసిందని ఇప్పుడు మూడు కిలోమీటర్లు పైబడి ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువ ఉన్నదని స్కూల్ అసిస్టెంట్ సబ్జెక్టు టీచర్ పోస్టులను రద్దు చేయడం ఎంతవరకు సబబుని నాగ జగదీష్ ప్రశ్నించారు. సమావేశంలో సూరే సతీష్, ఆళ్ల రామచంద్రరావు, కొట్ని రామకష్ణ, కాంగ్రెస్ సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని వినతి



విద్యుత్ ఎఇకి వినతి పత్రం అందజేస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి- మునగపాక రూరల్: పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని, లోవోల్టేజీ సమస్యలను పరిష్కరించాలని మండల తెలుగుదేశం పార్టీ నేతలు కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక విద్యుత్ సెక్షన్ ఆఫీసులో ఎఇ గోపికి టిడిపి మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దొడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలో పలు గ్రామాల ప్రజలు లోవోల్టేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నారన్నారు. డిమాండ్‌కు తగ్గట్టుగా విద్యుత్ సరఫరాలో అధికారులు, ప్రభుత్వం వైఫల్యం వల్ల గృహోపకరాలను పాడౌతున్నా యన్నారు. కాలం చెల్లిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను బాగుచేయడంతోపాటు, డిమాండ్‌కు తగ్గట్టుగా స్థాయిని పెంచిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు.. లేనిపక్షంలో విద్యుత్ సెక్షన్ ఆఫీసును ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు ఆర్గనైజింగ్ సెక్రటరీ దాడి ముసలినాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ మొల్లేటి సత్యనారాయణ, మండల ఐటిడిపి ఇన్‌ఛార్జి శరగడం యోగి నాగేశ్వరరావు, మండల కార్యవర్గ సభ్యుడు పూసర్ల సత్యనారాయణ, టిడిపి సీనియర్ నాయకులు పెతకం శెట్టి రాజునాయుడు, నాగులపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు పోలమర శెట్టి నాగు, వాడ్రాపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు సూరిశెట్టి రాము, తోటాడ గ్రామ శాఖ సెక్రెటరీ పోలమరశెట్టి మురళి, దళిత నాయకుడు గోసాల గోవింద్ పాల్గొన్నారు.

లోవోల్టేజీ సమస్య పరిష్కారంలో నిర్లక్ష్యం



అధికారులకు వినతిపత్రం ఇస్తున్న వినియోగదారులు

ప్రజాశక్తి- చోడవరం : గాంధీ గ్రామ పంచాయతీ విద్యానగర కాలనీలో నిరంతరం విద్యుత్‌కు అంతరాయం కలుగుతోందని, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆప్రాంత గృహ విద్యుత్ వినియోగదారులు శనివారం విద్యుత్ అధికారులకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా గాంధీ గ్రామసర్పంచ్ గాడి అప్పారావు, వైసిపి నాయకులు మారిశెట్టి శ్రీకాంత్ మాట్లాడితే ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటీ సరిపోకపోవడంతో నిరంతరం లోవోల్టేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. దీనిపై ఎన్నిసార్లు విన్నవించినా స్పందన లేదని, తక్షణమే విద్యానగర్‌లో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కుదర మాణిక్యం పాల్గొన్నారు.

హాస్టల్ భవనం పున:ప్రారంభం



హాస్టల్ భవనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ రవిసుభాష్

ప్రజాశక్తి - కశింకోట : మండల కేంద్రంలో మరమ్మతులు చేసి, ఆధునికీకరించిన సమగ్ర సాంఘిక సంక్షేమ శాఖ బాలికల హాస్టల్ భవనాన్ని జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి శనివారం పున్ణప్రారంభించారు. గతంలోకలెక్టర్ రవిసుభాష్ పర్యటనలో శిథిలావస్థకు చేరిన హాస్టల్ దుస్థితిని పరిశీలించి, లారస్ కంపెనీ సిఆర్ఎస్ నిధులు రూ.55 లక్షలతో హాస్టల్ మరమ్మతులు చేయించారు. వేసవి సెలవుల్లో పనులు చేయించి, పాఠశాలల పున:ప్రారంభం నాటికి అందజేశారు. కార్యక్రమంలో లారస్ కంపెనీ ప్రతినిధులు సౌమ్య, సిహెచ్ నర్సింగరావు సత్యనారాయణ హెచ్ఆర్ రామకృష్ణ, తహశీల్దార్ జి సత్యనారాయణ, సోషల్ వెల్ఫేర్ డిడి అజయ్‌బాబు పాల్గొన్నారు

పోతురాజు పండగకు విరాళం



రూ.50 వేల చెక్కును అందజేసిన ముత్యాల సతీష్

ప్రజాశక్తి- అనకాపల్లి : మునగపాక మండలం ఉమ్మలాడ గ్రామంలో పోతురాజు పండుగ సందర్భంగా కంకటాల బ్రదర్స్‌కు శనివారం ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వర తనయుడు సతీష్ రూ.50వేల విరాళ చెక్కును అందజేశారు. స్థానిక నర్సింగరావుపేట ఎంవిఆర్ ట్రస్ట్ కార్యాలయంలో చెక్కును అందించిన సతీష్ మాట్లాడుతూ, ఇటువంటి మంచి కార్యక్రమాలకు ఆర్థికంగా ఎప్పుడూ అండగా ఉంటామన్నారు కార్యక్రమంలో కంకటాల బ్రదర్స్ యూత్, ఎంవిఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

ఏసు మరణం తీరనిలోటు

ప్రజాశక్తి- చోడవరం : ఒపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు కుక్కల ఏసు మరణం ప్రజాఉద్యమానికి తీరని లోటని ఒపిడిఆర్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె. గౌరీశంకర్ శనివారం ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. విజయవాడ, పరిసర ప్రాంతాల్లో ప్రజాస్వామ్య హక్కుల కోసం ఏసు అలుపెరుగని పోరాటం చేశారని, పేదల సమస్యలపై నిరంతరం పోరాడుతూ పరిష్కారం అయ్యేంతవరకు పట్టుదలతో కృషి చేసేవారన్నారు.

తహశీల్దార్‌కు సత్కారం



తహశీల్దార్ వాసును సత్కరిస్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో భూములు, లీగల్ సెల్ విభాగంలో డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేసి, నాతవరం తహశీల్దార్‌గా బదిలీపై వెళు తున్న వాసును శనివారం పలు సంస్థల ప్రతినిధులు సత్కరించారు. ల్యాండ్ లీగల్ సెల్ విభాగాల పర్యవేక్షకులు ఆర్ నరసింగరావు, సిహెచ్ చంద్రశేఖర్ తోపాటు పలువురు ఘనంగా సత్కరించారు. కాగా వాసు ఎపి జెఎసి అమరావతి జిల్లా చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. వాసు కు ఉద్యోగోన్నతి రావడం పట్ల ఎపి జెఎసి అమరావతి, రెవెన్యూ సంఘాల ప్రతినిధులు అభినందించారు.

బ్యాంకు మేనేజర్‌కు సత్కారం


బ్యాంకు మేనేజర్ వంశీని సత్కరిస్తున్న గ్రామపెద్దలు

ప్రజాశక్తి- మునగపాక రూరల్: మండలంలోని తోటాడ బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచి మేనేజర్ వంశీ బదిలీపై వెళ్తున్న సందర్భంగా శనివారం ఆ గ్రామాల పెద్దలు దుశ్శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. బ్యాంకు ఆవరణలో జరిగిన కార్యక్రమంలో గ్రామ పెద్దలు దొడ్డి కోటేశ్వరరావు మాట్లాడుతూ, తోటాడ .బ్యాంకు శాఖను ఏర్పాటు చేసిన ఐదేళ్ల కాలంలో రూ.60 కోట్ల టర్నోవర్ చేర్చిన ఘనత బ్రాంచి మేనేజర్ వంశీదే నన్నారు. అలాగే .గ్రామీణ ప్రాంత ప్రజలకు విశేషమైన సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దాడి వీర మహాలక్ష్మి నాయుడు, పొలమరశెట్టి కుమారస్వామి, దాడి శ్రీనివాస్, నాయుడు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-చోడవరం : మండలంలో ముద్దుర్తి పంచాయతీ కొత్తపల్లి గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను గూర్చి వివరించారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందేలా సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు చర్యలు తీసుకోవాలని ధర్మశ్రీ సూచించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, ఎంపీపీ గాడి కాసు, వైసిపి నాయకులు పల్లా నర్సింగరావు, దొడ్డి వెంకటరావు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాల పరిశీలన

ప్రజాశక్తి- మునగపాక రూరల్: మండలంలోని తోటాడ, త్రిమూర్తుల ఆలయం సమీపంలో నిర్మిస్తున్న జగనన్న లే అవుట్‌ను హౌసింగ్ స్పెషల్ ఆఫీసర్ మంజులా వాణి, తహశీల్దార్ ప్రకాశరావు, ఎంపిడిఒ మన్మథరావు, ఇఒపిఆర్‌డి ఈశ్వరరావు శనివారం పరిశీలించారు. తొలుత కాలనీలో పనుల పురోగతిని అధికారులకు సర్పంచ్ దొడ్డి మంగవేణి వివరించారు. రోడ్లు, కాలువలు, తాగునీరు, విద్యుత్తు వంటి సదుపాయాలు ఏ విధంగా కల్పిస్తున్నది వివరించారు. కార్యక్రమంలో వైసిపి నేత దొడ్డి కోటేశ్వరరావు, సచివాలయ సెక్రెటరీ శ్రీలక్ష్మి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రాము పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని గోపాలపురం శివారు వెంకటరమణపేటలో రూ.12 లక్షల మండల పరిషత్ నిధులతో సిసి మెయిన్ డ్రైన్ నిర్మాణానికి శనివారం ఎంపిపి గొర్లి సూరిబాబు శంకుస్థాపన చేశారు. రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆదేశాలతో మురుగునీటి కాలువలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మాజీ ఉప సర్పంచ్ దుల్ల అప్పలరాజు, మండల కో ఆప్షన్ సభ్యులు బొండా అప్పలరాజు, వార్డు సభ్యులు బంటు శివ, రమణ అప్పారావు, కరణం సత్తిబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - పరవాడ: స్థానిక బిసి కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు 1 వ తరగతి నుండి 5 వ తరగతి వరకు పాఠ్య పుస్తకాల పంపిణీని శనివారం రాష్ట్ర సిఐసి సభ్యులు పైలా శ్రీనివాసరావు ప్రారంభించారు. జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పరవాడ సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, పెద్ద చెరువు రైతు సంఘం అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసరావు, వైసిపి నాయకులు, 3వ వార్డు సభ్యులు పైలా హరీష్, పైలా టివి అప్పారావు, హరి, పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జీవాలకు నట్టల నివారణ వ్యాక్సినేషన్

ప్రజాశక్తి- కశింకోట: ఈనెల 30వరకు గ్రామాల్లో జీవాలకు నట్టల నివారణ వ్యాక్సినేషన్ చేస్తామని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని నరిశింగబిల్లి పశు వైద్య అధికారి సిహెచ్ చైతన్యమణి సూచించారు. శనివారం త్రిపురవానిపాలెం గ్రామంలో 200 గొర్రెలకు మేకలకు డీవార్మింగ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవాలకు నట్టల నివారణ మందు అందించడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కలిగట్ల నూకరత్నం, వైస్ ఎంపిపి నమ్మి మీన, వెటర్నరీ సిబ్బంది రాజేష్, అశ్విని, వైసిపి నేతలు కలిగట్ల నాయుడు, నమ్మి గణేష్, పాల్గొన్నారు.

ముదుర్తిలో విషాదఛాయలు

దైవ దర్శనానికి వెళ్లి కోనసీమలో రోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం


బాధితులను పరామర్శిస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

ప్రజాశక్తి-చోడవరం : అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మడక వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంతో చోడవరం మండలం ముద్దుర్తి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ప్రమాదంలో ముద్దుర్తికి చెందిన నలుగురు వ్యక్తులు మృత్యువాత పడ్డారు. మరో ఆరుగురు గాయాలు పాలయ్యారు.. రెక్కాడితే గాని డొక్క నిండని పేదల ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. కుటుంబాల్లో పెద్దదిక్కును కోల్పోవడం వారిపై ఆధారపడ్డ దీవిస్తున్న మిగతా కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. కోనసీమ జిల్లాలో ఉన్న మందపల్లి శనీశ్వరుడి ఆలయానికి శుక్రవారం రాత్రి ముద్దుర్తి గ్రామం నుండి టాటా ఏసీ వాహనంలో తొమ్మిది మంది వెళ్లగా, ఆలమూరు మండలం మడక వద్ద వెనుక నుండి కారు ఢీకొనడంతో ప్రమాద సంభవించింది ఈ ప్రమాదంలో నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోగా మరో ఐదుగురు గాయాలు పాలయ్యారు. బోడి వెంకటరమణ(50) బోడి వెంకి నాయుడు(48) టాటా ఏసీ డ్రైవర్, గంగిరెడ్ల శ్రీనివాసరావు(33) పతివాడ కన్నయ్య లింగం(55) మృత్యువాత పడగా బోడి సత్యారావు, కోసూరి నరసింహారావు, ముచ్చల శ్రీను, తుమ్మన శ్రీను, అంకుపాలెం గ్రామానికి చెందిన హేమంతులు ఉన్నారు. వీరిలో బోడి వెంకటరమణ, వెంకి నాయుడులు అన్నదమ్ములు. మృతుడు గంగిరెడ్ల శ్రీనివాసు తాపీ మేస్త్రిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. కుటుంబంలో భార్య విజయ, కూతురు మేఘన కొడుకు హర్షవర్ధన్ చిన్నపిల్లలు, తల్లి వరహాలమ్మ, వికలాంగులైన తమ్ముడు గోవింద, అక్క అమ్మాజీ ఉన్నారు. వీరందరిని శ్రీనివాసు పనికి వెళ్లి పోషిస్తూ ఉన్నాడు. కుటుంబంలో ఉన్న పెద్దదిక్కు కోల్పోవడంతో కుటుంబ సభ్యులకు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. బోడి వెంకటరమణ చిన్నపాటి వ్యవసాయం చేసుకుంటూ రోజు కూలి పనులకు వెళుతూ ఉంటాడు. వెంకటరమణకు భార్య దేవుడమ్మ, కుమారులు రమేష్ ఆటో డ్రైవర్, రామకృష్ణ విద్యార్థి, కుమార్తె వరలక్ష్మి వీరెవరికి ఇంకా పెళ్లిళ్లు కాలేదు. పతివాడ కన్నయ్య లింగం తాపీ మేస్త్రి గా పనులు నిర్వహిస్తున్నాడు. అతడికి భార్య పార్వతీ కుమారుడు సాయి, కుమార్తె జయశ్రీ ఉన్నారు. బోడి వెంకయ్య నాయుడు టాటా ఏసీ వాహనం నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇతడికి భార్య లక్ష్మి, కుమారుడు కుమార్తె ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

మృతులు, గాయపడ్డ కుటుంబాల సభ్యులను స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ప్రమాద బారిన పడిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని ఆయన భరోసా ఇచ్చారు. అనంతరం కోనసీమ జిల్లా పోలీసు అధికారులు, అనకాపల్లి జిల్లా కలెక్టర్ తో ఆయన ఫోన్లో మాట్లాడారు. మృతదేహాలను గ్రామాలకు వేగంగా పంపించాలని కోరారు. అలాగే గాయ పడ్డ వారికి మెరుగైన చికిత్స అందించాలన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలను నియంత్రించండి


అధికారులకు ఫిర్యాదు చేస్తున్న ఎస్‌సి కాలనీవాసులు

ప్రజాశక్తి -వడ్డాది : వడ్డాది ఎస్‌సి కాలనీ సమీపంలోని పెద్దేరు నదిలో ఇసుక అక్రమ తవ్వకాలను నియంత్రించాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు. శనివారం సచివాలయంలో రెవెన్యూ పంచాయతీ అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. మాజీ వార్డు సభ్యుడు కె.గురుమూర్తి మాట్లాడుతూ మంచినీటి ట్యాంకు సమీపంలో అడ్డూ అదుపు లేకుండా టైరు బళ్లతో ఇసుక తవ్వకాలు చేపడుతున్నారని, తవ్వకాలు కొనసాగితే తుపాను సమయంలో వాటర్ ట్యాంక్‌కు ప్రమాదం తప్పదన్నారు..ఇసుక అక్రమ తవ్వకాలతో భూగర్భ జలాలు అడుగంటి పోయే ప్రమాదం ఉందన్నారు. అధికారుల స్పందించి ఇసుక తవ్వకాలను అరికట్టకపోతే ఆందోళన చేస్తామని ఎస్‌సి కాలనీ ప్రజలు హెచ్చరించారు.

సమగ్ర భూ రీసర్వే ప్రారంభం


భూరీ సర్వే పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్, ఎంపిటిసి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని కెపి అగ్రహారం రెవిన్యూ పరిధిలో జగనన్న భూరక్ష పథకంలో భాగంగా రీసర్వే పనులను స్థానిక సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు, ఎంపిటిసి దేవర అప్పారావు శనివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సర్వే ప్రక్రియను రైతులు అంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ దేవర ముసలి నాయుడు, సచివాలయం కన్వీనర్ అడ్డూరు శ్రీను, పాల సంగ అధ్యక్షులు తోరుబిల్లి కాసు, నాయకులు గోపిశెట్టి రమణ, విఆర్ఓ బి.బాలాజీ రావు, సర్వేయర్ పి.భవాని శంకర్ పాల్గొన్నారు.

జగనన్న సురక్షను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- కె. కోటపాడు : ఈనెల 23 నుండి వచ్చేనెల 23 వరకు జరుగు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల స్పెషలాఫీసర్ నాగలక్ష్మి కోరారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతూ.. గ్రామ సచివాలయ పరిధిలో సిబ్బంది, ప్రజా ప్రతినిధులు , వాలంటీర్లు, గృహసారథులు ఇంటింటికి వెళ్లి, సమస్యలపై ఆరా తీయాలన్నారు. ప్రభుత్వ పథకాల విషయాల్లో గానీ, మరణ ధ్రువపత్రం, ఆదాయ, వివాహ పత్రాల విషయంలో ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే అప్పటికప్పుడు పరిష్కరిస్తామన్నారు. ఎంపిడిఒ, తహశీల్దార్ ఆధ్వర్యంలో రెండు వేర్వేరు బృందాలు గ్రామాల్లో పర్యటిస్తాయని, ఈ మేరకు షెడ్యూల్ ప్రకటిస్తామన్నారు. సచివాలయ ఉద్యోగులు క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె. శశిదేవి, తహశీల్దార్ రమేష్ బాబు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్... పలుచోట్ల విద్యాకానుక కిట్ల పంపిణీ


జెవికె కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ప్రజాశక్తి- సబ్బవరం : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఇఒఎస్ అప్పలరాజు అధ్యక్షతన జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం విద్యకు పెద్ద పీట వేసిందన్నారు.నాడు-నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తయారుచేసి, అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు, అమ్మఒడి పథకంలో ఫీజులు, ఉచిత మధ్యాహ్న భోజనం, డిక్షనరీ పుస్తకాలు అందించడమే కాకుండా అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు .పదోతరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు ప్రోత్సాహకాలను అందిస్తున్నామన్నారు. మండలంలోని ఏనిమిది ప్రభుత్వ పాఠశాల్లలో పదోతరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు చినమ్మాయి, ఎంపిపి బోకం సూర్యకుమారి రాము నాయుడు, జెడ్‌పి. వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, వైస్ ఎంపిపిలు శరగడం రూన్నీలక్ష్మిరాణి, చొక్కాకుల గోవింద, పిఎసిఎస్ చైర్మన్ కాపుశెట్టి శేషుబాబు, వైసిపి నేతలు కోటాన రాము, సబ్బవరపు ముత్యాల నాయుడు, కర్రిబాబు,ఉప సర్పంచ్ మండల లక్ష్మణరావు పాల్గొన్నారు.

తగరపువలస : భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయతీ పరిధి ప్రభుత్వ పాఠశాలలో శనివారం జగనన్న విద్యా కానుకలు (జెవికె) కిట్లు విద్యార్థులకు పంపిణీ చేశారు. పంచాయతీ ఉప సర్పంచ్ పి. గంగశ్రీను, ఎస్ఎంసి చైర్మన్ ఎం.అప్పలకృష్ణ పాల్గొన్నారు.

సీతమ్మధార : రాజేంద్రనగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లును 25వ వార్డు కార్పొరేటర్ సారిపల్లి గోవింద్ పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు సరోజిని, శారద, అరుణ, సచివాలయ ఎడ్యుకేషన్ సెక్రటరీ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట: విద్యా ప్రమాణాల మెరుగుకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని సర్పంచ్ కొన లోవరాజు అన్నారు. రావికమతం మండలం కొత్తకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో శనివారం జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాడు - నేడులో సుమారు రెండు కోట్లకు పైగా నిధులతో పాఠశాలను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దేవ, వైసీపీ ప్రధాన కార్యదర్శి తలారి ఆదిమూర్తి, ఎంపిటిసి పూడి దేవ, స్కూల్ అభివృద్ధి కమిటి చైర్మన్ అడ్డురు అప్పలకొండ, హెచ్ఎం నవర బ్రాహ్మజీ తదితరులు మాట్లాడారు. అనంతరం గత పదవ తరగతి పరీక్షల్లో ఫలితాలలో అధిక మార్కులు సాధించిన ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. .జగనన్న విద్యా కానుక కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమం లో వైసీపీ బిసి సెల్ మండల శాఖ అధ్యక్షులు బి.పాండు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గొలుగొండ: జగనన్న విద్యా కానుకలను విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి గజ్జలపు మణికుమారి అన్నారు. గొలుగొండ కస్తూర్బా బాలికల పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకు వచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి సుర్ల ఆదినారాయణ, కస్తూర్బా ప్రత్యేక అధికారిని సుధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత




విద్యార్థులతో మంత్రులు, ఎంపీ

ప్రజాశక్తి-అనకాపల్లి: జగన్ ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. శనివారం స్థానిక జివిఎంసి ప్రధాన ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాల సభలో మాట్లాడుతూ, గతేడాది పది, ఇంటర్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాల పథకం కింద అవార్డులు, నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి అమర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను రూ.15 వేల కోట్ల నాడు నేడు నిధులతో ఆధునికీకరించామన్నారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు మాట్లాడుతూ విద్యావ్యవస్థలో జగన్మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఉన్నత విద్యకు అన్ని సౌకర్యాలను కల్పించి ప్రోత్సాహించేందుకు జగన్ సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి దిలీప్ కుమార్, జిల్లా కలెక్టర్ రవి శుభాష్ పటాన్ శెట్టి, జిల్లా పరిషత్ వైస్ చైర్పర్సన్ బిశెట్టి వరాహ సత్యవతి, కార్పొరేటర్ జాజుల ప్రసన్న లక్ష్మి రమేష్, ఎంపీపీ గొర్లె సూరిబాబు, మళ్ళ బుల్లిబాబు తదితరులు పాల్గొన్నారు. వికలాంగులకు మోటర్ రైజెడ్ త్రీ వీలర్ స్కూటర్లను మంత్రులు అమర్నాథ్, ముత్యాల నాయుడు, ఎంపీ సత్యవతి పంపిణీ చేశారు.

కశింకోట : మండలంలోని నరసింగబిల్లి హైస్కూల్‌లో 10 వ తరగతి పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు బుదిరెడ్డి చంద్రశేఖర్, మజ్జి పవనకుమార్, భీముని లీలా అదిలక్ష్మిలను జగనన్న ఆణిముత్యాల పేరుతో సత్కరించి, మెడల్‌తోపాటు నగదు పురస్కారాలను అందజేశారు. సర్పంచ కోన అరుణ నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు సునీత, స్కూల్ కమిటీ చైర్మన్ సేనాపతి లక్ష్మి, కొన వెంకట సత్యనారాయణ, నారాయణరావు పాల్గొన్నారు

నర్సీపట్నంటౌన్: పెదబొడ్డేపల్లిలోని ఏపి ఆర్ స్కూల్‌లో జగనన్న ఆణి ముత్యాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విద్యకు అత్యధిక ప్రాధాన్యత



నర్సీపట్నంలో పురస్కారాన్ని అందుకుంటున్న విద్యార్థి

ఇస్తున్నారన్నారు. ఇతర రాష్ట్రాల కంటే 3 రెట్లు అధికంగా రాష్ట్ర ప్రభుత్వం విద్య కోసం ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ద్యార్థులు ఉన్నత శిఖరాలకు వెళ్లాలంటే విద్యుత్ తోనే సాధ్యమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నర్సీపట్నం టౌన్ పార్టీ ప్రెసిడెంట్ ఏకా శివచ యాదగిరి శేషు తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంట: రోలుగుంట కేజిబివిలో చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు జగనన్న అణిముత్యాలు ప్రోత్సాహక అవార్డును అందుకున్నారు. మాకిరెడ్డి దివ్య మొదటి బహుమతి రూ.50వేలు, మడ్డు ధనలక్ష్మీ రెండవ బహుమతి రూ.30వేలను శనివారం అనకాపల్లి జివిఎంసి హైస్కూల్‌లో ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, ఐటి శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపి సత్యవతి, కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి చేతుల మీదుగా అందజేశారు.

ఆనందపురం : మండలంలోని ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆనందపురం, పద్మనాభం, భీమునిపట్నం మండలాల జగనన్న ఆణిముత్యాలు అవార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మొదటి బహుమతిగా రూ.15 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10 వేలు, తృతీయ బహుమతిగా రూ.5 వేలు చొప్పున ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అందించారు. భీమిలి మండలంలో 63, ఆనందపురం మండలంలో 36, పద్మనాభం మండలంలో 27, చినగదిలి మండలంలో 24 మంది విద్యార్థులను సన్మానించి నగదు పురస్కారాలతో పాటు సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో ఆనందపురం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు కెసిఆర్, జడ్‌పిటిసి సభ్యులు కోరాడ వెంకటరావు, ఎంపీపీ మజ్జి శారద ప్రియాంక, వైస్ ఎంపీపీ శ్రీను, బట్ట ధనలక్ష్మీరామకష్ణ, వైసిపి ప్రెసిడెంట్ బంక సత్యనారాయణ, స్థానిక సర్పంచ్ చందక లక్ష్మి, లోదగల రమణ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్

వరి విత్తన శుద్ధిపై అవగాహన

ప్రజాశక్తి -నక్కపల్లి: వరి విత్తన శుద్ధి పై ఆర్ బి కే సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ సూచించారు. నక్కపల్లి రైతు భరోసా కేంద్రం వద్ద శనివారం వరి విత్తన శుద్ధి పై సిబ్బందికి అవగాహన కల్పించారు. సూడో మోనాస్‌తో వరిలో వచ్చే తెగుళ్లను నివారించ వచ్చునని అన్నారు. విత్తన శుద్ధితో నారు కుళ్లు తెగులు, అగ్గి, ఆకు మచ్చలు, పొడ, ఎండు తెగుళ్ల ను నివారించవచ్చునన్నారు. విత్తన శుద్ధికి 10 గ్రాముల సూడో మోనాస్ పొడిని ఒక కేజీ వరి విత్తనాలకు కలిపి ఒక రోజు నానబెట్టి, ఎక్కువగా ఉన్న నీరు తీసేసి మొలకలు వచ్చినప్పుడు ఉపయోగించాలని సూచించారు. రైతు భరోసా కేంద్రాల్లో వరి విత్తనాలను అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సత్యనారాయణ పాల్గొన్నారు.



పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-ఎస్.రాయవరం: జిపిఎస్ ఏర్పాటు చేసి కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేసి ఉద్యోగుల జీవితానికి ఒక భద్రతను కల్పించిన గొప్ప వ్యక్తి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. శుక్రవారం సాయంత్రం కొరుప్రోలు క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఉద్యోగుల సంక్షేమం కోసం పే కమిషన్ ఏర్పాటు చేసి కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేసిన ఘనత వైసిపి ప్రభుత్వానికి దక్కుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వీసం రామకృష్ణ, శీరం నరసింహమూర్తి, మాతా గురునాధరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌గా విజయ్ కుమార్



ప్రజాశక్తి -ఎస్.రాయవరం: మండల నూతన తహశీల్దార్‌గా బి.విజయ్ కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఉమ్మడి విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సెక్షన్ సూపరింటెండెంట్‌గా పని చేస్తూ, పదోన్నతిపై ఎస్.రాయవరం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో పథకాలపై సమీక్ష నిర్వహించి త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపడతానని తెలిపారు. ఆయనకు డిప్యూటీ తహసీల్దార్ కె.శ్యామ్ కుమార్, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

22 నుంచి పాదయాత్ర

ప్రజాశక్తి -కొత్తకోట: రావికమతం మండలం చీమలపాడు పంచాయతీలో ఈ నెల 22 నుంచి ఆదివాసి రుణ విమోచన పాదయాత్ర, 24 న ఆదివాసీ పోటుకూరి కరకన్న స్మారక సభ నిర్వహిస్తున్నట్టు అఖిల భారత్ ఆదివాసి సంఘం, అఖిల భారత్ వ్యవసాయ గ్రామీణ, కార్మిక సంఘం ప్రతి నిదులు మోసే రాజు, పి.రమణ శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ యాత్రలో కర్ణాటక హై కోర్టు న్యాయవాది, ఆల్ ఇండియా లాయర్ల సంఘం ప్రధాన కార్యదర్శి క్లిఫ్టన్ డి.రోజారియో, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి పిఎస్ అజెయ్ కుమార్ తదితరులు హాజరు కానున్నారని తెలిపారు.



పనులు చేపడుతున్న కూలీలు

పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-రావికమతం: మండలంలోని కవగుంట గ్రామంలో సిసి రోడ్డుకి ఇరువైపులా కాలువ లేక పోవడంతో మురుగునీరు రోడ్డుపైకి చేరుతోంది. గమనించిన సర్పంచ్ దాసరి సూర్య కుమారి పారిశుధ్య పనులను చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, సాసబిల్లి దేవుళ్ళు ఇంటి వద్ద నుంచి రేణం పెంటారావు ఇంటి వరకు రోడ్డుపైనే వాడుకనీరు పారడంతో డ్రెయినేజీని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. సిసి రోడ్డుపైన నీరు పారడంతో ఆ రహదారి గుండా వెళ్లే పాదచారులు, వాహన చోధకులు ఇబ్బందులు ఎదుర్కొనే వారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్య పనుల నిమిత్తం నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.



పరామర్శిస్తున్న కౌన్సిలర్లు

సర్పంచ్‌కు పరామర్శ

ప్రజాశక్తి-గొలుగొండ: చోద్యం సర్పంచ్ ఆదపురెడ్డి గోపాలకృష్ణ కుటుంబీకులను శనివారం అయ్యన్న యువసేన అధ్యక్షులు, కౌన్సిలర్ చింతకాయల రాజేష్, పలువురు కౌన్సిలర్లు పరామర్శించారు. ఇటీవల గోపాలకృష్ణ తల్లి ఆదపురెడ్డి సత్యవతి అనారోగ్యంతో మృతి చెందారు. పరామర్శించిన వారిలో నర్సీపట్నం కౌన్సిలర్లు ధనిమిరెడ్డి మధు, పైల గోవిందు, మాజీ ఎంపిటిసి కె.రవివర్మ, మాజీ సర్పంచ్ గెడ్డం సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

సమస్యలపై ఎమ్మెల్యే గణేష్‌కు మొర

ప్రజాశక్తి-గొలుగొండ: ముఖ్యమంత్రి వైయస్. జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన అందిస్తున్నారని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అన్నారు. శనివారం మండలంలోని పాత మల్లంపేట పంచాయతీలోని బొడ్డెడపాడు, చంద్రయ్యపాలెం, కొత్తపాలెం గదబపాలెం, పాతమల్లంపేట తదితర గ్రామాలలో ఎమ్మెల్యే శనివారం గడపగడపకు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ఇప్పటివరకు ప్రభుత్వం ద్వారా అందిన పథకాలను వివరిస్తూ ఇంకనూ ఏమైనా సమస్యలు ఉన్నాయంటూ ప్రశ్నించారు. ఈ సందర్భంగా తమ గ్రామానికి ఆర్ఓఆర్ పట్టాలు మంజూరు చేయవలసిందని బుడ్డడపాడు మాజీ ఉపసర్పంచ్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. తమ గ్రామానికి 30 ఆర్ఓఆర్ పట్టాలు ఇవ్వాల్సి ఉండగా కేవలం ఎనిమిది మందికి మాత్రమే పట్టాలిచ్చారని తెలపగా పట్టాల పొందిన వారి వివరాలు తనకు అందజేయాలన్నారు. డిఎఫ్ఓతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. తన కుమారుడు పుట్టినప్పటి నుంచి నడవలేక పోతున్నాడని ఓ గిరిజన మహిళ తన బిడ్డను ఎమ్మెల్యేకు చూపించగా మంచి వైద్యులకు చూపించి వైద్య సహాయం అందించేందుకు గాను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎన్నికల ముందు



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గణేష్

పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు నవరత్నాలు, సంక్షేమ పథకాలు అమలులోకి తీసుకు వచ్చిన ముఖ్యమంత్రి వైయస్. జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లుగా అమలు చేస్తున్నారన్నారు. రాజకీయాలు, పార్టీలు, మతాలు చూడకుండా అర్హత ఉన్న వారందరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపిపి గజ్జలపు మణికుమారి, మండల పార్టీ అధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షురాలు లోచల సుజాత పాల్గొన్నారు.

రూ.25 లక్షలతో ఆలయ నిర్మాణం

ప్రజాశక్తి-మాడుగుల: మండల కేంద్రంలోని జగ్గన్న చావిడి వద్ద 25 లక్షలతో రామాలయ నిర్మాణానికి ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు కృషి చేస్తున్నట్టు ఎంపిపి పెదబాబు తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ, అనకాపల్లి ఎంపి సత్యవతి నిధుల నుండి 5 లక్షలు, ఆలయం పూర్తి అయ్యే వరకు టిటిడి నిధులు 20 లక్షలు కేటాయించే విధంగా మంత్రి కృషి చేస్తున్నారన్నారు. టిటిడి, పురాణ పండిట్ అధికారులు నిర్మాణ స్థలం పరిశీలించారని, ప్రతిపాదనలు పంపడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, కుక్కర శ్రీధర్, భూసాల అప్పలరాజు, చల్లా రామస్వామి, కోసిరెడ్డి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి

మాజీ చైర్మన్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-కోటవురట్ల: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మాజీ చైర్మన్ రామభద్రరాజు చిత్రపటానికి శనివారం తంగేడు గ్రామంలో జరిగిన సంస్మరణ సభలో రాష్ట్ర భారీ పరిశ్రమ శాఖ మంత్రి అమర్నాథ్, అనకాపల్లి ఎంపీ సత్యవతిలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణరాజు, చిక్కాల రామారావు పాల్గొన్నారు.



ర్యాలీ చేపడుతున్న వైద్య సిబ్బంది

అతిసారపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-ఎస్.రాయవరం: అతిసార నియంత్రణ పక్షోత్సవాల ముగింపు సందర్భంగా మండలంలో సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద అవగాహన ర్యాలీ నిర్వహించామని ఆరోగ్య విస్తరణాధికారి బి.సత్యనారాయణ తెలిపారు. ఆయుష్ విభాగం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అర్ సుజాత మాట్లాడుతూ, వడదెబ్బ తగలకుండా టోపీ ధరించాలన్నారు. మలేరియా ఇంఛార్జి నోడల్ అధికారి పిఎన్‌విఎస్ ప్రసాద్ మాట్లాడుతూ,ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో శరీరంలో నీటి శాతం తగ్గి డిహైడ్రేషన్‌కు గురవుతారని, ఈ సమయంలో ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగాలన్నారు. కొబ్బరి నీళ్లు, మజ్జిగ, బార్లీ తదితర ద్రావణాలు తాగాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సచివాలయం హెల్త్ సెక్రెటరీ ఎన్.రాజేశ్వరి, స్టాఫ్ నర్స్ వెంకట్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారులు

స్పందన సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజాశక్తి -కోటవురట్ల: స్పందనలో వచ్చిన సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మండల ప్రత్యేక అధికారి అరుణ శ్రీ తెలిపారు. శనివారం తహసిల్దార్ కార్యాలయంలో పలు సమస్యల పరిష్కారానికి ఫిర్యాదుదారులతో మండల స్థాయి అధికారులు సమావేశమయ్యారు. ప్రధానంగా పలు గ్రామాలకు చెందిన నాలుగు రెవెన్యూ సమస్యలు వచ్చినట్లు తహసిల్దారు జానకమ్మ తెలిపారు. హౌసింగ్, ఉపాధి కార్యాలయ సమస్యను పరిష్కా రానికి చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, స్థానిక ఎస్సై నారాయణరావు, ఏఓ చంద్రశేఖర్, ఈఓపిఆర్‌డి సుబ్రహ్మణ్యం, ఆర్ఐ ఉర్ధవరావు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న చిన్మయిదేవి

ఐసిడిఎస్, అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి-గొలుగొండ: గొలుగొండ ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయాన్ని రీజనల్ జాయింట్ డైరెక్టర్ సిహెచ్.చిన్మయిదేవి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ కార్యాలయ సిబ్బందితో సమావేశమై నూతన ప్రాజెక్టుకు సంబంధించిన విధివిధానాలు తొందరగా అమలు పరిచేలా సిడిపిఒ శ్రీగౌరిని ఆదేశించారు. నాడు నేడు పనులు, పోషణ అభియాన్, వైయస్సార్ సంపూర్ణ పోషణ అమలుపై, బడ్జెట్‌లపై కార్యాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, ప్రాజెక్టు బ్లాక్ కోఆర్డినేటర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ: అంగన్వాడీ కేంద్రంలో కార్యకర్తలందరూ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని రీజినల్ జాయింట్ డైరెక్టర్ చిన్మయిదేవి అన్నారు. మండలంలో ఎఎల్ పురం-4 అంగన్వాడి కేంద్రంను ఆమె శనివారం సందర్శించారు. కేంద్రంలోని పోషకాహార నిల్వలను, వాటి రిజిస్టర్లను ఆమె పరిశీలించారు. అంగన్వాడీ కార్యకర్త మంగతాయి, తదితరులుపాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు సహకరించాలి



హాజరైన ఎమ్మెల్యే, అధికారులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: ప్రధాన పట్టణ రోడ్డు విస్తరణ పనులపై మరోసారి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో రోడ్డు విస్తరణ పై అధికారులతో ఎమ్మెల్యే నేతృత్వంలో ఆర్డిఓ జయరామ్ నేతృత్వంలో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసేందుకు సమావేశాన్ని శనివారం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పోలీస్ విద్యుత్, టౌన్ ప్లానింగ్ మున్సిపల్, దేవాదాయ శాఖ పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. కమిషనర్ కనకారావు విస్తరణ పనులకు పూర్తిస్థాయి నివేదికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్ మాట్లాడుతూ, అబీద్ సెంటర్ నుండి పెద్ద బొడ్డేపల్లి వరకు రోడ్డు పనులు చేపట్టేందుకు తీర్మానం చేశారని, విస్తరణ పనులపై అన్ని నివేదికలు సిద్ధం చేశామని తెలిపారు. వ్యాపారస్తులకు, వర్తకులకు నష్టం జరుగుతున్నప్పటికీ భవిష్యత్తు తరాలను దృష్టిలో పెట్టుకొని రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. నర్సీపట్నం డివిజన్ కేంద్రం కావడంతో అన్ని మండలాల నుండి అనేక పనులపై ప్రజలు రావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలియజేశారు. రోడ్డు విస్తరణ పనులకు ప్రజలు, వర్తకులు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, కౌన్సిలర్ కోనేటి రామకృష్ణ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి



చౌడువాడలో పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలో చౌడువాడ గ్రామంలో శనివారం మండల ప్రత్యేక అధికారి జగనన్న కాలనీ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ, కాలనీ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారులకు అవసరమైన ఐరన్, సిమెంటు, ఇసుక అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. నిర్మాణదారులకు ఇబ్బందులు కలగకుండా కల్పించాలన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, స్థానిక సర్పంచ్ గోపాలకృష్ణ, హౌసింగ్ ఏఈ జగదీశ్వరరావు, పిఆర్ఏఈ వర్మ, ఏఈ కరుణ, ఏఓ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ: ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి బి.మోహన్‌రావు జగనన్న కాలనీ లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని రావణాపల్లి గ్రామ పంచాయతీలో హౌసింగ్ కాలనీ, సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే ఇళ్ల నిర్మాణాలను మొదలు పెట్టని లబ్ధిదారులంతా త్వరితగతిన చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్‌డి రఘురాం, పంచాయతీ కార్యదర్శి అప్పారావు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న అధికారులు

ఉపాధ్యాయులను నియమించాలి



నినాదాలు చేస్తున్న గిరిజనులు, పిల్లలు

ప్రజాశక్తి-రోలుగుంట: తమ గ్రామాల్లో ఉపాధ్యాయులను నియమించాలని రోలుగుంట మండలం ఆర్ల పంచాయతీ పెద్దగరువు, పిత్రిగడ్డ, లోసింగి, పాతలోసింగి ఆదివాసి గిరిజనులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు కె.గోవిందరావు మాట్లాడుతూ, రోలుగుంట మండలం ఆర్ల పంచాయతీ పిత్రిగడ్డ, పెద్దగరువు, పాతలోసింగి, లోసింగిలో పిటిజి కోందుకు చెందిన వారు కొండల మధ్యలో జీవనం సాగిస్తున్నారన్నారు.. పంచాయతీ కేంద్రంకు రావాలంటే ఎనిమిది కిలోమీటర్లు కొండలో గుట్టలో దాటుకొని రావాల్సి ఉందన్నారు. చోడవరం ఎమ్మెల్యే ధర్మశ్రీ, జిల్లా కలెక్టర్ స్పందించి ఉపాధ్యాయులను ఏర్పాటు చేసి, సొంతంగా స్కూలు నిర్మాణం చేస్తామని చెప్పినా అమలు కాలేదన్నారు. ఉచిత ప్రాథమిక హక్కుగా రాజ్యాంగంలో సెక్షన్21(ఎ) రూపొందించినా ఆదివాసి గిరిజన గ్రామాలకు అమలు కాలేదన్నారు. ప్రాథమిక విద్య అభ్యసించడానికి 8 కిలోమీటర్ దూరం వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. చట్టానికి వ్యతిరేకంగా ఎనిమిది కిలోమీటర్ల దూరంలో స్కూల్‌కి వెళ్లే పరిస్థితిని తీసుకొస్తున్నారన్నారు. ఆర్టికల్ 21 ఏ ప్రకారం ఆదివాసి ప్రాంతంలోనే 6 సంవత్సరాల నుండి 14 సంవత్సరాలు పైబడి విద్యార్థులకు ఒక కిలోమీటర్ పరిధిలోనే విద్య అందించాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కిలో నరసయ్య, ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.మహేష్ తల్లిదండ్రులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న కూలీలు


ఉపాధి కూలీల ఆందోళన

ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలో బుచ్చంపేట గ్రామంలో శనివారం ఉపాధి కూలీలు ఉపాధి పనుల్లో అక్రమాలు జరిగాయని, ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా కనీసం స్పందించకపోవడంపై కూలీలు శనివారం గ్రామ సచివాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామంలో వారం రోజులు ఎండలో పని చేసినా కేవలం మూడు రోజులు మాత్రమే మస్తరును ఫీల్డ్ అసిస్టెంట్ వేస్తున్నారన్నారు. పని చేయకుండా షాపులు నడుపుకునే, జీడిపిక్కల ఫ్యాక్టరీలో పని చేసే వారికి, గ్రామంలో లేనివారికి వారానికి ఆరు రోజులు పేమెంట్స్ చెల్లిస్తున్నారన్నారు. ఈ విషయాలను స్పందనలో జిల్లా అధికారులకు ఏడు సార్లు విన్నవించుకోవడం జరిగిందన్నారు. అక్రమాలకు పాల్పడ్డ ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

శ్రీప్రకాష్ విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-పాయకరావుపేట: శ్రీప్రకాష్ విద్యానికేతన్ లో 9 వ తరగతి చదువుతున్న ఎన్‌విఎంఎస్ ముకేష్, బి.మధు వీరేంద్ర ఎన్‌సిసి విభాగానికి చెందిన ఈ ఇద్దరు క్యాడెట్లు గుంటూరులో జరిగే ఆల్ ఇండియా ఏక్ భారత్ స్వచ్ఛ భారత్ శిబిరానికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు బి. సీతారాణి తెలిపారు. వీరు జూన్ 15 నుండి జూన్ 26 వరకు గుంటూరులో జరిగే అంతర రాష్ట్ర విద్యార్థులతో జరిగే ఈ శిబిరంలో పాల్గొంటారని తెలిపారు. వీరి ఎంపిక పట్ల శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అధినేత సిహెచ్ వి కె నరసింహ రావు, సంయుక్త కార్యదర్శి సి హెచ్ విజయ ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవి విఎస్ మూర్తి అభినందనలు తెలిపారు.





పశుబీమాపై అవగాహన

ప్రజాశక్తి-రోలుగుంట: రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్ధకశాఖ ద్వారా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న డాక్టర్ వైయస్సార్ పశుబీమా పథకంపై శనివారం మండలంలోని కొవ్వూరు రైతు భరోసా కేంద్రం వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు. పశువైద్యాధికారి నూకేశ్వరరావు ఈ పథకం వివరాలను తెలిపారు. ఈ సదస్సుకు హాజరైన జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి ప్రసాదరావు మాట్లాడుతూ, పాడి రైతు, గొర్రెల, పందుల పెంపకందారులు ఈ పథకంపై అవగాహన కల్పించుకొని భీమా చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బికే ఇన్‌చార్జ్ రాజు, పాడి రైతులు, గొర్రెల పెంపకందారులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారి